

రేషన్‌కార్డు కావాలా.. సచివాలయం. కరెంట్ మీటరు సమస్య.. సచివాలయం. ఇంటి పన్నులు.. ప్లాన్లు.. కుళాయి కనెక్షన్లు అవసరమా.. సచివాలయం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలా.. సచివాలయం. వీధిలో చెత్త.. మురుగు.. తదితర సమస్య పరిష్కారమా.. సచివాలయం. ఇలా స్థానిక సమస్యల నుంచి ప్రజలకు అవసరమైన వివిధ ధృవీకరణపత్రాల వరకు అన్నింటికీ సచివాలయమే దిక్కుగా గత ప్రభుత్వం చేసింది. పంచాయతీరాజ్ వ్యవస్థను, స్థానిక స్వపరిపాలనను నీరుగారుస్తూ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో తొలిగా సచివాలయ ఉద్యోగులను ఆయా శాఖలకు సర్దుబాటు చేసేలా నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలకు ప్రాధాన్యం పెంచే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.



సచివాలయం.. సర్దుబాటు

- ఆయా శాఖలకు ఉద్యోగుల బదిలీ?
- ఇప్పటికే మాతృశాఖకు పంచాయతీ కార్యదర్శులు
- వలంటీర్ల స్థానంలో సచివాలయ ఉద్యోగులకు విధులు
- సచివాలయ సిబ్బంది లాగిన్లలోకి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్
- గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్‌కు సమాంతరంగా సచివాలయ వ్యవస్థ
- గ్రామ పంచాయతీలకు ప్రాధాన్యం పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు

గుంటూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఏ చిన్న పని వచ్చినా, ఏ అవసరం ఉన్నా, ఏ సమస్య వచ్చినా సచివాలయలదే రాజ్యం. వారి పాలన అంతా సర్వం సచివాలయాలమయం అన్నట్లుగా సాగింది. దీంతో రాజ్యాంగబద్ధమైన పంచాయతీరాజ్ వ్యవస్థ, స్థానిక స్వపరిపాలన ప్రమాదంలో పడిపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థపై దృష్టి సారించింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్న కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు గుడ్‌బై చెప్పి ఆ స్థానంలో గ్రామ పంచాయతీలకు ప్రాధాన్యం పెంచే దిశగా చర్యలు చేపట్టింది. సచివాలయ ఉద్యోగులను సర్దుబాటు చేస్తామని సూచన ప్రాయంగా చెప్పిన ప్రభుత్వం బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఓ నిర్ణయానికి వచ్చింది. నిర్ణయానికి వచ్చిందే తడవుగా చర్యలకు శ్రీకారం చుట్టింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో మొత్తం 14,183 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. గుంటూరు జిల్లాలో 4,979 మంది, పల్నాడు జిల్లాలో 4,816 మంది, బాపట్ల జిల్లాలో 4,388 మంది ఉద్యోగులు ఉన్నారు. వారికి గత ప్రభుత్వం నిర్దిష్టమైన జాబ్ చార్టు ఇవ్వకుండా రకరకాల పనులు కేటాయించింది. సచివాలయాల ద్వారా 543 రకాల సేవలు అందిస్తామని చెప్పినా ఆచరణలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 1బీ అడంగల్, పాసు పుస్తకాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ మినహా వారు అందించే సేవలు పెద్దగా ఏమీ లేవు. దీంతో ఉద్యోగులంతా ఖాళీగా ఉండడమో, వారి మాతృశాఖకు సంబంధించిన విధులు చేయడమో, మీసేవా కేంద్రాల్లో ఉండే డేటా ఆపరేటర్ల మాదిరిగా మారిపోవడమో జరిగింది. దీనికంతటికీ చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో ఇప్పటికే గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులను పంచాయతీరాజ్‌శాఖలోకి బదిలీ చేసింది. వారిని ఆయా పంచాయతీలకు కార్యదర్శులుగా నియమించింది. మిగిలిన ఉద్యోగులను కూడా ఆయా శాఖల్లో సర్దుబాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్దుబాటుకు సంబంధించి ప్రొఫార్మా రూపొందించాలని అధికారులకు ప్రభుత్వం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా మహిళా పోలీస్ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. వారిని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకువెళతారా.. లేక హోమ్ శాఖ పరిధిలో ఉంచుతారా అన్నది తేలాల్సి ఉంది.

వలంటీర్లు కనుమరుగు

తాజా పరిణామాల నేపథ్యంలో వలంటీర్ వ్యవస్థకు ప్రభుత్వం స్వస్తి చెప్పినట్లుగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే వైసీపీ ఆదేశాలతో మూడొంతుల మంది వలంటీర్లు రాజీనామా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో వలంటీర్లు చేపట్టే పింఛన్ల పంపిణీ తదితర సంక్షేమ కార్యక్రమాలను సచివాలయ ఉద్యోగుల ద్వారా అమలు చేస్తోంది. ఇక పూర్తిగా ఆయా బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకే అప్పగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వలంటీర్ల లాగిన్లలో ఉన్న లబ్ధిదారుల హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను సచివాలయ సిబ్బంది లాగిన్లలోకి మారుస్తున్నారు. ఒక్కో ఉద్యోగికి వంద నుంచి 150 మంది వరకు లబ్ధిదారులు ఉండేలా ఈ మ్యాపింగ్ ప్రక్రియ జరుగుతోంది. ఆ మేరకు నిర్దిష్టమైన ప్రొఫార్మా గ్రామ, వార్డు సచివాలయ డైరెక్టర్ నుంచి జిల్లా అధికారులకు అందింది. ఆ ప్రొఫార్మాలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను రెండు రోజుల్లో పూర్తి చేసి సైన్డ్ కాపీ, సాఫ్ట్ కాపీని మానిటరింగ్ గ్రూప్‌లో పోస్టు చేయాలని ఉద్యోగులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల్లో లాంగ్ లీవ్, మెడికల్ లీవ్, మెటర్నిటీ, స్టడీ లీవ్‌లు తీసుకున్నా, షార్ట్ లీవ్, అబ్‌స్కాన్డ్, నాట్ జాయిన్డ్, డెప్యూటేషన్‌పై ఉన్న ఉద్యోగుల వివరాలను కూడా డైరెక్టరేట్‌కు పంపించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సర్దుబాటు ఇలా..

ఉద్యోగులు	శాఖలు
డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు	పంచాయతీరాజ్ శాఖ
ఏఎన్‌ఎంలు	వైద్య శాఖ
వ్యవసాయ సహాయకులు	వ్యవసాయ శాఖ
వెటర్నరీ అసిస్టెంట్లు	పశుసంవర్థక శాఖ
హార్టికల్చర్ అసిస్టెంట్లు	ఉద్యాన శాఖ
ఫిషరీస్ అసిస్టెంట్లు	మత్స్య శాఖ
సర్వే అసిస్టెంట్లు	సర్వే శాఖ
వీఆర్‌వోలు	రెవెన్యూ శాఖ
మహిళా పోలీసులు	స్పష్టత లేదు

బీసీ స్టడీ సర్కిల్‌కు.. నిధులు

- కూటమి ప్రభుత్వంలో మళ్లీ పూర్వ వైభవం
- ఇక నిరుద్యోగ యువతకు నిరంతర శిక్షణకు చర్యలు
- గ్రూపు పరీక్షలతోపాటు సివిల్స్ పరీక్షార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు
- వైసీపీ హయాంలో పాలకుల నిర్లక్ష్యం స్టడీ సర్కిల్ నిర్వీర్యం

గుంటూరు(విద్య), సెప్టెంబరు 19: ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకోలేక.. మెటీరియల్ కొనుగోలు చేయలేక.. పోటీ పరీక్షలకు సరైన శిక్షణ పొందలేక.. ఐదేళ్లుగా అవస్థలు పడిన నిరుద్యోగ యువత కష్టాలకు తెరపడింది. గతంలో ఒక వెలుగు వెలిగి.. ఎందరికో దిక్సూచిగా నిలిచిన గుంటూరులోని బీసీ స్టడీ సర్కిల్ మళ్లీ పూర్వ వైభవం దిశగా సాగనున్నది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైపోయిన బీసీ స్టడీ సర్కిల్‌ను తిరిగి గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం నిధులు సమకూర్చేందుకు సిద్ధమైంది. వైసీపీ ప్రభుత్వంలో నిధుల కొరత, నిర్లక్ష్యంతో బీసీ యువతకు దూరమైన శిక్షణా కార్యక్రమాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన సమీక్షలో రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్లకు రూ.10 కోట్లు వరకు నిధులు విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా యువత కోసం రాజాగారితోటలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు నిధులు విడుదల అయ్యే అవకాశం ఉందని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నిధులతో ఇక నుంచి ఏటా వంద మందికి సివిల్స్ శిక్షణ ఇప్పించాలని యోచిస్తున్నారు. అంతేకాకుండా గ్రూపు పరీక్షలకు కూడా యువతకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న స్టడీ సర్కిల్‌కు సొంత భవనం కోసం కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

నిరుద్యోగ యువతకు మార్గదర్శి..

ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం విడుదల చేసే నోటిఫికేషన్లకు అనుగుణంగా బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. డీఎస్సీ, పోలీసు ఉద్యోగాల, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకు, రైల్వే, గ్రూపు, సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలకు ఇక్కడ నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆయా పోటీ పరీక్షలకు బయట శిక్షణ తీసుకుంటే ఒక్కో పరీక్షకు సంబంధించి సగటున రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అభ్యర్థులు చెల్లించుకోవాల్సిన దుస్థితి. దీనికి తోడు పుస్తకాల కొనుగోలు, మెటీరియల్‌కు అదనంగా చెల్లించాలి. ఈ నేపథ్యంలో బీసీ స్టడీ సర్కిల్ నిరుద్యోగ యువతకు ఆశాకిరణంగా మారింది. శిక్షణ కోసం అభ్యర్థులకు ముందుగా అంతర్గతంగా రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల విద్యార్హతలు పరిశీలించి మెరిట్ ఉన్న వారిని ఎంపిక చేసి ఆయా పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ కోసం ఎంపిక చేస్తారు. ఎంపికలో బీసీ యువతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, ఓసీ సామాజికవర్గాల యువతకు కూడా అవకాశం కల్పిస్తారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతోమంది యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. శిక్షణ కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి ఎంతోమంది యువత పోటీ పడతారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ ఉన్న గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు చదువుతూ పరీక్షలకు సిద్ధం అయ్యేవారు కూడా ఉన్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల లేమి, పాలకుల నిర్లక్ష్యంతో బీసీ స్టడీ సర్కిల్ దాదాపు నిర్వీర్యమైందనే చెప్పాలి. చివరలో గ్రూపు పరీక్షలకు అరకొర శిక్షణ ఇవ్వడం మినహా నాలుగున్నర సంవత్సరాలు నిరుద్యోగులకు ఎటువంటి శిక్షణ కార్యక్రమాలు లేవు. గత ప్రభుత్వం చివర దశలో డీఎస్సీ, గ్రూపు పరీక్షలకు రెండు నోటిఫికేషన్లు తప్ప ఇతరత్రా ఎటువంటి ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లు ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసినా వాటికి సంబంధించి కూడా స్టడీ సర్కిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం శిక్షణకు కనీస చర్యలు తీసుకోలేదు. ఫలితంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- కోటప్పకొండ ఈటీ సెంటర్ వద్ద ఆందోళన
- ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులపై పోలీసులకు ఫిర్యాదు

గ్రానైట్ యజమానుల రాస్తారోకో



కోటప్పకొండ వద్ద ఆందోళన చేస్తున్న గ్రానైట్ మిల్లుల యజమానులు

నరసరావుపేట రూరల్, చిలకలూరిపేట, సెప్టెంబరు 19: పల్నాడు జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట - కోటప్పకొండ మార్గంలో ఈటీ సెంటర్ వద్ద గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు, కార్మికులు గురువారం రాస్తారోకో చేశారు. మైనింగ్ సీనరేజ్ వసూలు చేస్తున్న ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు తమను అన్ని రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రానైట్ లారీలకు అన్ని రకాల బిల్లులు ఉన్నా ఏఎంఆర్ సంస్థ సిబ్బంది అక్రమంగా నగదు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తమను సక్రమంగా వ్యాపారం చేసుకోనివ్వడం లేదని వాపోయారు. సరైన బిల్లులతో గ్రానైట్ ముడి సరుకును వాహనాల్లో పంపుతున్నా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఏజెన్సీని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈటీ జంక్షన్ నుంచి కోటప్పకొండ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. జిల్లా మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలిరెడ్డిపాలెం చెక్‌పోస్టు వద్ద సిబ్బంది గ్రానైట్ లారీ డ్రైవర్, ఫ్యాక్టరీ సూపర్‌వైజర్‌పై దాడి చేసి కొట్టారని చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో దర్యాప్తు చేయాలని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు డిమాండ్ చేశారు.

పేరేచర్ల లేఅవుట్‌లో అక్రమాలు

- అక్రమార్కులపై చర్యలు: మంత్రి పార్థసారథి హెచ్చరిక
- వచ్చే ఏడాది మార్చికి లబ్ధిదారులకు ఇళ్లు అందించాలన్న మంత్రి



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారు బోడపాటి లత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 19: రాష్ట్రంలోనే అతి పెద్ద హౌసింగ్ లేఅవుట్లలో ఒకటిగా ఉన్న పేరేచర్లలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన నిర్మాణ సంస్థ అక్రమాలకు పాల్పడిందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నదని నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గురువారం పేరేచర్లలోని ఇళ్ల లేఅవుట్, నిర్మాణాలను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి సకల సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లను కేటాయించిందని, పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆప్షన్ 3లో నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు 15 రోజుల్లో బిల్లులు మంజూరు చేస్తామన్నారు. అర్హత లేని వారికి పట్టాలు ఇచ్చారని రుజువైతే వాటిని రద్దు చేస్తామన్నారు. టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి వచ్చిన రుణాలను కూడా గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, దీనిపై కూడా విచారణ జరుపుతామన్నారు. పేరేచర్ల లేఅవుట్ నుంచి బండారుపల్లి డొంక వరకు ఉన్న రహదారిని పూర్తి చేస్తామని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ హామీ ఇచ్చారు.

ఫిర్యాదులే ఫిర్యాదులు..

లేఅవుట్‌లో నీరు, విద్యుత్, సరైన రోడ్లు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని పలువురు లబ్ధిదారులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇంటి నిర్మాణ సామగ్రి చోరీ అవుతుందని చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సౌకర్యాలను తక్షణమే కల్పిస్తామని, పోలీసుల రక్షణ ఉండేలా చూస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సచివాలయంలో పనిచేసే మణికంఠ ఇల్లు కట్టిస్తామని రూ.3.70 లక్షలు తీసుకున్నాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బోడపాటి లత అనే లబ్ధిదారు మంత్రికి ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, గృహ నిర్మాణశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణాల వివరాలను మంత్రికి వివరిస్తున్న జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్

మూతపడిన సాగర్ క్రస్ట్‌గేట్లు

- వరద తగ్గుముఖంతో నీటి విడుదల నిలిపివేత



మాచర్ల రూరల్, సెప్టెంబరు 19: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు గురువారం డ్యాం క్రస్ట్‌గేట్లను మూసివేశారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 589.70 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 2236 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4613 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,866 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 38,115 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 38,115 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 29,850 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు. గేట్లన్నీ మూసి వేశారు.

జూట్‌మిల్లు ఆస్తులను దోచేశారు

- భజరంగ్ యాజమాన్యాన్ని బెదిరించిన మురళీకృష్ణ
- రూపాయి పెట్టుబడి పెట్టకుండా అంబటికి రూ.కోట్ల ప్రాజెక్టు
- ఇప్పటికీ గ్రీన్‌గ్రేస్ పనులు ఆపమని ఆదేశాలివ్వని అధికారులు
- ఆధారాలు లేకుండానే సంగం డెయిరీపై గత ప్రభుత్వం అనేక ఆరోపణలు
- పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 19: భజరంగ్ జూట్ మిల్ యాజమాన్యాన్ని బెదిరించి గుంటూరు నగర నడిబొడ్డున రూ.కోట్ల ఆస్తులను వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తమ్ముడు అంబటి మురళీకృష్ణ దోచుకున్నాడని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భజరంగ్ యాజమాన్యాన్ని బెదిరించిన ఘటనలో వైసీపీ ముఖ్య నేతలు కూడా ఉన్నారన్నారు. నిర్మాణాలకు స్థలాన్ని ఇస్తే 510 ప్లాట్లలలో కేవలం 87 మాత్రమే ఇచ్చేలా బెదిరించి మురళీకృష్ణ జూట్‌మిల్లు యాజమాన్యంతో అగ్రిమెంట్ రాయించుకున్నారన్నారు. కలకత్తాలో ఉండే యాజమానులను ఇక్కడకు రానివ్వకుండా సంతకాలు చేయించుకున్నారన్నారు. గుంటూరుకు చెందిన నూకల చంద్రశేఖర్, హైదరాబాద్‌కు చెందిన కరణం వెంకట సృజన్‌కుమార్‌లతో రెరాకు ఫిర్యాదు చేయించి, రెరా సభ్యులైన చందు సాంబశివరావు, కామేశ్వరరావుల ద్వారా ఆదేశాలు పొంది వాటిని అడ్డుగా పెట్టుకుని భయపెట్టడంతో అంబటి మురళిని జూట్‌మిల్లు యాజమాన్యం డైరెక్టర్‌గా చేర్చుకుందన్నారు. పైసా పెట్టుబడి పెట్టకుండా రూ.కోట్ల ఆస్తిని కాజేసేందుకు అంబటి మురళి రూపొందించిన పథకం వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ బెదిరింపుల వ్యవహారంపై పోలీసులు చేత విచారణ చేయిస్తామన్నారు. జగన్ ఏపీని ఏవిధంగా దోచుకున్నాడో అదే తరహాలో అంబటి మురళి కూడా జూట్‌మిల్ ఆస్తులను దోచుకున్నాడన్నారు. అనుమతులు లేకుండా చేపడుతున్న గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ పనులు ఆపాలని నోటీసు ఉన్నా జీఎంసీ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో అనధికారికంగా బ్లాస్టింగ్ జరుగుతుందని తెలిపారు. కార్పొరేషన్ అధికారులతో మురళి కుమ్మక్కయ్యారని, అందువల్లే పనులు నిలుపుదల చేయకుండా, నిర్విరామంగా కొనసాగిస్తున్నారన్నారు. సంగం డెయిరీపై ఏ ఆధారాలు లేకుండా గత ప్రభుత్వంలో అనేక ఆరోపణలు చేసి దేనినీ నిరూపించలేదన్నారు. కానీ మురళిపై తాను చేస్తున్న ఆరోపణలకు పూర్తి ఆధారాలు ఉన్నాయని నరేంద్ర తెలిపారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

నిజాన్ని అంగీకరించండి లేదా పోరాడండి

కొరియోగ్రాఫర్ షేక్ జానీబాషా (జానీ మాస్టర్) లైంగిక ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయనపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై నటుడు మంచుమనోజ్ స్పందించి.. ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'తప్పు చేస్తే అంగీకరించండి లేదా పోరాటం చేయండి. అంతేకాని పారిపోవద్దు' అని ఆయన హితవు పలికారు. "జానీ మాస్టర్.. కెరీర్ పరంగా ఈ స్థాయికి వచ్చేందుకు మీరు ఎంతలా శ్రమించారో అందరికీ తెలుసు. ఈరోజు మీపై ఇలాంటి ఆరోపణలు రావడం చూస్తుంటే నా హృదయం ముక్కలవుతోంది. నిజం ఎప్పటికైనా బయటపడుతుంది. తప్పు ఎవరిది అనేది చట్టం నిర్ణయిస్తుంది. ఒక మహిళ తన స్వరాన్ని వినిపించినప్పుడు





పారిపోవడం అనేది సమాజానికి, రానున్న తరాలకు ఒక ప్రమాదకరమైన సందేశాన్ని ఇస్తుంది. జానీ మాస్టర్.. నిజాన్ని ఎదుర్కోండి. మీరు ఏ తప్పూ చేయకపోతే పోరాటం చేయండి. మీరు దోషి అయితే.. దానిని అంగీకరించండి ఈ కేసు విషయంలో వేగంగా స్పందించి చర్యలు తీసుకున్న హైదరాబాద్ సిటీ పోలీస్‌లకు అభినందనలు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఇది తెలియజేస్తుంది. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఇచ్చిన మాట ప్రకారం ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్‌ని వెంటనే సిద్ధం చేయాలని కోరుతున్నా. దాని కంటూ ప్రత్యేకంగా సోషల్‌మీడియా ఖాతాలు ఏర్పాటు చేయండి. మన పరిశ్రమలోని మహిళలకు గళంగా నిలవండి. ఇబ్బందుల్లో ఉన్న మహిళల బాధను వింటామనే విషయాన్ని ప్రతి మహిళకు తెలియజేయండి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలబడిన మన పరిశ్రమ పెద్దలు, కో వర్కర్స్‌కు నా మద్దతు తెలియజేస్తున్నా. న్యాయం, గౌరవం అనేది మాటల్లో మాత్రమే కాకుండా చేతల్లోనూ చూపించే విధమైన సమాజాన్ని నిర్మిద్దాం. కూతురు, సోదరి, తల్లి.. ఇలా ప్రతి మహిళ కోసం ఈ పోరాటం. వారికి అన్యాయం జరగకుండా చూద్దాం" అని మనోజ్ పేర్కొన్నారు. అలాగే, మరో నటుడు నాగబాబు చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆయన చేసిన ట్వీట్ జానీ భాషాని ఉద్దేశించినదే అని నెటిజనులు అనుకుంటున్నారు. ఇంతకీ ఆ ట్వీట్‌లో ఏముందంటే.. "తప్పు చేసిన వ్యక్తి చట్టపరంగా దోషిగా తేలనంతవరకూ.. ఆ వ్యక్తి తప్పు చేసినట్లు కాదు" అని సర్ విలియమ్ గ్యారో అనే రచయిత కొటేషన్‌ను నాగబాబు పోస్ట్ చేశారు.

కొత్త తేదీన కంగువ




సూర్య కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ ఖరారైంది. నవంబర్ 14న 'కంగువ'ను విడుదల చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ యూనిట్ గురువారం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దిశాపటానీ, బాబీడియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు.

గుండెను తాకే నాన్న పాట



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. చిత్రబృందం గురువారం 'నాన్న' సాంగ్‌ను విడుదల చేసింది. తండ్రీ కొడుకుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ సాగే ఈ గీతానికి లక్ష్మీ ప్రియాంక సాహిత్యం అందించగా జై కృష్ణ స్వరపరిచారు. నజీరుద్దీన్ ఆలపించారు. ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సాయిచంద్, ఆమని కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి



అనంత శూన్యం నుంచి ప్రారంభమై అన్నింటినీ తనలో ఇమడ్చుకున్న మహామనీషి అక్కినేని. తెలుగు అక్షరమాలలో మొదటి అక్షరంతో మొదలైన ఆయన పేరు మిగిలిన అక్షరాలకు ధైర్యాన్ని ఇవ్వడమే కాదు, ఆయన జీవితాన్ని ఒక అందమైన కావ్యంగా తీర్చిదిద్దింది. మహానటుడిగా నిలబెట్టింది. దైవం, అదృష్టాల కన్నా కృషినే నమ్మారు అక్కినేని. ఆయన **శతజయంతి (సెప్టెంబర్ 20) సందర్భంగా** పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రత్యేక స్టాంప్ విడుదల చేస్తోంది.

జననం - 20-09-1924
మరణం - 22-01-2014

ఓ బాటసారి నిను మరువమోయి



భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక శిఖరంలాంటి నటుడు అక్కినేని నాగేశ్వరరావు. 90 వసంతాల జీవితంలో 70 వసంతాలను అభినయ కళకు అర్పించిన అరుదైన నటుడు. రంగస్థలంపై ఆడవేషాలతో నటనను ఆరంభించి కాలక్రమంలో అభినయ కళాశాలగా, నట నిఘంటువుగా ఎదిగారాయన.

ప్రారంభంలో జానపద, పౌరాణిక చిత్రాల కథనాయకునిగా తన నటజీవితాన్ని ఆరంభించినప్పటికీ కాలక్రమంలో అనేకానేక ఆధ్యాత్మిక, సాంఘిక పాత్రల ద్వారా సమకాలీన జీవన సొబగులను అభినయించి సినీ మాధ్యమాన్ని జనజీవనంతో మమైకం చేసిన ప్రజానటుడు ఆయన.

వాల్మీకి, క్షేత్రయ్య, తుకారామ్, తెనాలి రామకృష్ణ, విప్రనారాయణ, జయదేవుడు, కబీరు, కాళిదాసు వంటి విభిన్న పాత్రలు పోషించి తనకు తానే సాటి అనిపించుకున్నారు. నటనకే పరిమితం అవకుండా నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. నాటకాల రోజుల నుంచి తనకు ఎంతో అండగా నిలిచిన దుక్కిపాటి మధుసూదనరావుతో కలసి అన్నపూర్ణ పిక్చర్స్ పతాకంపై ఆణిముత్యాల లాంటి చిత్రాలు నిర్మించారు. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుతో కలసి చక్రవర్తి చిత్ర పతాకంపై 'సుడిగుండాలు', 'మరో ప్రపంచం' వంటి ప్రయోగాత్మక సినిమాలు తీశారు. ఆ తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై ఎన్నో చిత్రాలు అందించారు.

స్వరాష్ట్రంలో చిత్ర పరిశ్రమ

తెలుగు చిత్ర పరిశ్రమ మదరాసు నగరం నుంచి హైదరాబాద్‌కు తరలి రావడానికి తొలి రోజుల్లో ఎంతో కృషి చేసిన వ్యక్తి అక్కినేని. 'నాతో సినిమా తీయాలనుకునే





నిర్మాతలు హైదరాబాద్‌కు రండి' అని కండీషన్ పెట్టి, దాని మీదే చివరి వరకూ నిలబడ్డారు అక్కినేని. ఆ రోజుల్లో భాగ్యనగరంలో చిత్ర నిర్మాణానికి అవసరమైన వసతులు అరకొరకుగానే ఉన్నా, వాటితోనే సరిపుచ్చుకుని అద్భుత చిత్రాలు తీయడానికి కారకులయ్యారు అక్కినేని.

మూడు పద్మాలూ ఆయనకే!

ఒక నటునిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా, ఓ మహోన్నత వ్యక్తిగా అక్కినేని నాగేశ్వరరావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తమ అధికార పరిధిలోని సమస్త సినీ ఘన పురస్కారాలను ఆయనకు కట్టబెట్టి పట్టాభిషేకాలు చేశాయి. మూడు పద్మాలు.. పద్మశ్రీ పద్మభూషణ్, పద్మవిభూషణ్ పొందిన ఏకైక నటుడు అక్కినేని. అలాగే ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో తెలుగు వెలుగుల్ని హస్తినాపురం వరకూ ప్రసరింపచేసిన తొలి దక్షిణాది కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు.

నటనకే అంకితమైన కుటుంబం

ఏయన్నార్‌తో పాటు ఆయన కుటుంబం కూడా చిత్రపరిశ్రమకే అంకితమైంది. నాగేశ్వరరావు పెద్ద కుమారుడు వెంకట్ నిర్మాతగా కొనసాగారు. రెండో కుమారుడు నాగార్జున నటుడిగా, ఆయన కుమారుడు నాగచైతన్య, అఖిల్ హీరోలుగా ఉన్నారు. అక్కినేని పెద్ద అల్లుడు సురేంద్ర నిర్మాత కాగా, ఆయన కుమారుడు సుమంత్ నటుడిగా, కుమార్తె సుప్రియ కూడా ఆర్టిస్టులుగా కొనసాగుతున్నారు. అన్నపూర్ణ స్టూడియో బాధ్యతల్ని సుప్రియ నిర్వర్తిస్తున్నారు. ఇక అక్కినేని చిన్న కుమార్తె సుశీల కూడా నిర్మాతగా ఉన్నారు. ఆమె కుమారుడు సుశాంత్ నటుడిగా కొనసాగుతున్నారు.


చివరి చిత్రం 'మనం'

ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల కథానాయకులు పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రణధీర్ కపూర్ కలసి హిందీలో 'కల్ ఆజ్ ఔర్ కల్' (నిన్న నేడు రేపు) అనే చిత్రంలో కలిసి నటించారు. అది 1971లో విడుదలైంది. దాని తర్వాత మూడు తరాల కథానాయకులు కలిసి నటించిన చిత్రం 'మనం'. నాగేశ్వరరావు, నాగార్జున, నాగచైతన్య అందులో ప్రధాన పాత్రధారులు. అఖిల్ ఈ సినిమా పతాక సన్నివేశంలో కనిపిస్తారు. మూడు తరాలకు సంబంధించి ఆసక్తికరమైన కథను తయారు చేసి, విక్రమ్ కుమార్ దర్శకత్వం వహించారు.

తొలి సినిమా 'శ్రీసీతారామ జననం'

మొదటి చిత్రం 'శ్రీసీతారామ జననం'లో శ్రీరాముడి పాత్రను అక్కినేని పోషించారు. 1944లో విడుదలైన ఈ చిత్రానికి ఘంటసాల బలరామయ్య నిర్మాత, దర్శకుడు.



సాధారణంగా ప్రేక్షకులెప్పుడూ హీరో పాత్ర మరణించడాన్ని జీర్ణించుకోలేరు. కానీ, అక్కినేని నటించిన దేవదాసు, ప్రేమాభిషేకం సినిమాల్లో హీరో మరణించినా ప్రేక్షకులు వాటికి బ్రహ్మరథం పట్టారు. ప్రణయ భావాల్ని, విషాదాల్నీ పలికించడం ఎవరికైనా సులువే. కానీ, వైరాగ్యాన్నీ, వేదాంతాన్నీ కలగలిపి పలికించడం అంత సులువేం కాదు. కళ్లు ఏడుస్తుంటే, పెదాలు నవ్వడం ఏకకాలంలో జరగాలి మరి! అలాంటి కష్టసాధ్యమైన హావభావాల్ని అలవోకగా, అద్భుతంగా పండించిన అసామాన్యుడు అక్కినేని. అందుకే భగ్న ప్రేమికుడి పాత్రలకు ఆలంబనగా, తాగుబోతు పాత్రలకు చిరునామాగా నిలిచారు అక్కినేని

'స్వీయ లోపంబు లెరుగుట పెద్ద విద్య'.. ..అక్కినేని తరుచుగా చెప్పే మాట ఇది. చెప్పడమే కాదు ఆచరణలో కూడా చూపించారు. తన లోపాలను ఇతరులకంటే ముందు గ్రహించి, దానికి అనుగుణంగానే పాత్రలు ఎంపిక చేసుకోవడం అక్కినేని విజయరహస్యం. మనిషి అందగాడు కాదు, అరడుగుల ఆజానబాహు కాదు. మరో వైపు ఎన్టీఆర్ వంటి సర్వాంగ సుందరుడు, ఆజానుబాహుడు తన పోటీగా, సమవుజ్జీగా ఎదుగుతుండగా తన అనర్హతల లేమిని కప్పిపుచ్చుకుంటూ, తన మనోబలాన్ని పెంచుకుంటూ అక్కినేని సాగించిన ఆరోగ్యకరమైన వృత్తిపోటీ ఈ నాటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పాలి

అక్కినేని పోషించిన దసరా బుల్లోడు పాత్ర ఒక సంచలనం. అతను టిప్‌టాప్‌గా రంగురంగుల బట్టలు వేస్తాడు. హీరోయిన్‌తో షికార్లు చేస్తాడు. 'పచ్చగడ్డి కోసేటి పడుచు పిల్లోయ్.. నీ పైటకొంగు జారిందే గడుసు పిల్లా' అని ఆమెని టీజ్ చేస్తాడు. డాన్సులు వేస్తాడు. తమ కుటుంబానికి అపకారం తలపెట్టిన దుష్టుల తాట వలిచేస్తాడు. ఆ పాత్రను సృష్టించింది వి.బి. రాజేంద్రప్రసాద్. ఆ సినిమాకి ఆయనే నిర్మాత, అంతేకాదు, ఆ సినిమాతోటే ఆయన దర్శకుడి అవతారమెత్తారు. అలా 'దసరా బుల్లోడు'గా అక్కినేని వీరంగం ఆడేశారు. ఆయన స్టెప్పుల్లో జనం స్టెప్పులేశారు. ఆ సినిమా నుంచే 'డాన్సింగ్ ఐకాన్'గా రూపు దాల్చారు.

అప్‌డేట్స్

చిత్రీకరణ షురూ



'దసరా' కలయిక మరోసారి కుదిరింది. నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో మరో చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించారు. ఈ విషయాన్ని శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

సంపత్ నందితో శర్వా



శర్వానంద్ కథానాయకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. 'శర్వా 38' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కె.కె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ గురువారం మేకర్స్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. శర్వా మునుపెన్నడూ చేయని పాత్రలో కనిపించనున్నారని యూనిట్ తెలిపింది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్

మరోసారి మెగాఫోన్



ధనుష్ తాను కీలకపాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రం ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి ఆయన ఓ చిత్రంలో హీరోగా నటించడంతో పాటు మెగాఫోన్ పట్టారు. డాన్‌పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆకాశ్ భాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'ఇడ్లీ కడై' అనే ఆసక్తికర టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఇడ్లీ బండి దగ్గర పిల్లలు నిల్చున్న పోస్టర్‌ను విడుదల చేశారు. ధనుష్‌కు దర్శకుడిగా ఇది నాలుగో చిత్రం. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: కిరణ్ కౌశిక్.

వారంలోగా తేల్చండి



కంగనా రనౌత్, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రలో నటించి.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. సెన్సార్ చిక్కులతో చిత్రం విడుదల వాయిదా పడుతోంది. అయితే ఈ సినిమా సెన్సార్ సర్టిఫికేట్ విషయంలో వారంలోగా ఓ నిర్ణయానికి రావాలని బాంబే హైకోర్టు సెన్సార్ బోర్డును ఆదేశించింది. ఈ సినిమా సెప్టెంబర్ 6న విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ చిత్రంలో సిక్కు వర్గాన్ని కించపరిచే సన్నివేశాలు ఉన్నాయి కాబట్టి సినిమా విడుదలను నిలిపివేయాలని కొన్ని సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు వారి వాదనలను పరిగణలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించింది. మరోవైపు కంగన, చిత్ర నిర్మాణసంస్థ జీ ఎంటర్టైన్‌మెంట్స్ ఈ విషయమై బాంబే కోర్టును ఆశ్రయించగా, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వమని.. సెన్సార్ బోర్డును ఆదేశించలేమని బాంబే హైకోర్టు తెలిపింది. ఈ క్రమంలోనే తాజా విచారణ అనంతరం వారంలోపు ఓ నిర్ణయానికి రావాలని బాంబే కోర్టు సెన్సార్ బోర్డుకు సూచించింది.



సీఎం చంద్రబాబునాయుడుకి చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, కూతుళ్లు భవ్య, హారిక

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 7 లక్షల విరాళం

తాడికొండ, సెప్టెంబరు 19 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులను ఆదుకోవటానికి రూ. 7 లక్షల విరాళాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేసినట్లు మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం సీఎం నారా చంద్రబాబునాయుడుని ఆమె తన కుమార్తెలు భవ్య, హారికలతో కలిసి ఈ చెక్కును అందజేశారు. అనంతరం శ్రీదేవి మాట్లాడుతూ వరదల నుంచి విజయవాడ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడమే కాకుండా వరద బాధితులకు సహాయ సహకారాలు అందించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరద బాధితులకు సహాయం చేయటానికి ఎంతో మంది ముందుకు రావడం సంతోషదాయకం అన్నారు.

వరద బాధితులకు చేయూత



నారా లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న జెల్ది అనిల్ తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 19: వరద బాధితులకు టీడీపీ నాయకుడు జెల్ది అనిల్‌కుమార్ అండగా నిలబడ్డారు. గురువారం ఉండవల్లిలోని నివాసంలో విద్యా, ఐటీ శాఖ మంత్రి నారాలోకేష్‌కు రూ. 3 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు తమ వంతు సాయం అందించిన జెల్ది అనిల్‌ను లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్ పబ్లికేషన్ నిర్వాహకులు శేషావలి, నేలటూరి దాసు పాల్గొన్నారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్‌కు కావూరి హైస్కూల్ విద్యార్థి రాకేష్ మారుతి ఎంపిక



చెరుకుపల్లి, సెప్టెంబరు 19 : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ టోర్నమెంట్‌కు కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అక్కల రాకేష్‌మారుతి బ్రహ్మారెడ్డి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ వనజాక్షి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 30 నుండి అక్టోబరు 5వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటాడని చెప్పారు. రాకేష్ మారుతికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను, విద్యా కమిటీ చైర్మన్ పుష్పలతను ఉపాధ్యాయులు అభినందించారు.

అండగా ఉంటా .... ఆదుకుంటా

- ప్రజలతో మంత్రి నారా లోకేష్
- 33వ రోజు ప్రజాదర్బార్‌లో భారీగా విన్నపాలు

తాడేపల్లి, సెప్టెంబరు 19: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర మంత్రి, టీడీపీ యువ నేత నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు భారీగా ప్రజలు విచ్చేసి అటు రాష్ట్ర వ్యాప్తంగా ఇటు స్థానికంగా వినతి పత్రాలు అందజేశారు. తమ బాధలు, సమస్యలను అర్జీల రూపంలో గురువారం ఆయనకు విన్నవించారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి, విజ్ఞప్తులు స్వీకరించిన లోకేశ్, వారి సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మంగళగిరి నియోజకవర్గం నుంచి విజ్ఞప్తులు

అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమారుడికి వైద్యసాయం అందించి ఆదుకోవాలని మంగళగిరి 12వవార్డుకు చెందిన తమ్మిశెట్టి రమణమ్మ మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. భర్త చనిపోయిన తాను కూలిపనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నానని, తన చిన్న కుమారునికి గుండెల్లో నీరు చేరి అస్వస్థకు గురయ్యాడని కన్నీటిపర్యంతమైంది. వైద్య సాయం అందించాలని కోరగా ఆదుకుంటానని లోకేశ్ చెప్పారు. మతిస్థిమితం లేని కారణంగా తన కుమారుడు మూడు నెలల క్రితం తప్పిపోవడంతో అతనికి ఇచ్చే పెన్షన్ నిలిపివేశారని తిరిగి వచ్చిన కారణంగా పెన్షన్ పునరుద్ధరించాలని మంగళగిరి సాయినగర్‌కు చెందిన గుండా అన్నపూర్ణమ్మ విజ్ఞప్తి చేశారు. మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహ స్వామి 3,4 ఘాట్ రోడ్ మలుపులకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని మంగళగిరికి చెందిన వెనిగళ్ల ఉమాకాంతం, కేన్సర్‌తో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఉండవల్లికి చెందిన సాలిక సాయమ్మ కోరారు. నిడమర్రు గ్రామం లో ఉన్న తన రెండు ఎకరాల భూమికి సీఐడీ విచారణ పేరుతో గత మూడేళ్లుగా కౌలు నిలిపివేశారని, విచారణ చేసి కౌలు మంజూరుతో పాటు ప్లాట్లు రిజిష్టరు చేసేలా చర్యలు తీసుకుకోవాలని రెడ్డి పద్మావతి కోరారు. ఈ మేరకు పరిశీలించి ఆదేశాలు జారీ చేస్తానని లోకేశ్ చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం సద్దాం కాలనీ ఏల్ బేతల్ చర్చి స్థలం ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని పాస్టర్ పీటర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కేటాయించిన 15 సెంట్లలో చర్చి నిర్మించుకుని ప్రార్థనలు చేసుకుంటున్నామని ఎం.రమణబాబు, బీ. రమణ, వారి అనుచరులు దౌర్జన్యం చేసి చర్చిలో వస్తువులను ధ్వంసం చేశారని, చంపేస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. చర్చి స్థలాన్ని కాపాడడంతోపాటు తనకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కవులూరుకు చెందిన చిన్న సన్నకారు రైతులు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. బుడమేర కాలువ మీద ఉన్న తొమ్మిడ్ర వాగుకు 2 వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉందని, వర్షాకాలంలో వాగునీరు పొంగి పొలాలపైకి ప్రవహించడం వల్ల పంట నష్టపోతున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పాలేరు రిజర్వాయర్ కింద సేకరించిన తమ 7.18 ఎకరాల భూమికి ఇస్తామన్న నష్టపరిహారం ఇంత వరకు మంజూరు కాలేదని పరిశీలించి అందేలా చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా తలకొండపాడుకు చెందిన రాయల ఆదిశేషయ్య విజ్ఞప్తి చేశారు. ఆర్డీవోకు చెప్పినా ఫలితం లేదన్నారు. టీటీడీ దేవస్థానంలో పని చేస్తున్న విష్ణుసారధి సొసైటీ డ్రైవర్లకు గత ప్రభుత్వం పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించకుండా అన్యాయం చేసిందని లడ్డూ, గుర్తింపుకార్డులు కూడా ఇవ్వకుండా కాలయాపన చేశారని లోకేశ్‌కు చెప్పారు. తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు.



వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్, మహిళ నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న చిత్రం

ఆలయంలో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 19 : పొన్నూరు పట్టణంలోని సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయంలో గత వైసిపి ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశించారు. గురువారం సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయాని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో పర్యటించారు. ఆలయానికి వచ్చిన భక్తులను పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ హయాంలో నిర్వహించిన కుంభాభిషేకానికి దేవాదాయ శాఖ అనుమతిపై అధికారులను ఆరా తీశారు. అయితే దేవాదాయ శాఖ నుంచి అనుమతి లేదని సమాధానం రావడంతో మరి ప్రజల నుంచి నిధులు ఎలా వసూళు చేశారని, ఆ నిధుల వ్యయ వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని ఆదేశించారు. కుంభాభిషేకానికి సంబంధించి ఆలయంలో ఏర్పాటు చేసిన శిలాఫకంపై కూడా భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దేవాలయ ప్రాంగణంలో పురపాలక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ఎవరి అనుమతితో నిర్మించారో వివరాలు ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆలయంలో పనిచేస్తున్న కొందరి అర్చకులపై భక్తులు తీవ్ర ఆరోపణలు చేశారు. అర్చకుల ప్రవర్తనల వల్లన ఆలయానికి భక్తులు రాకుండా వెళ్లిపోతున్నారని, వచ్చిన భక్తులపై అర్చకులు వ్యవహరిస్తున్న తీరుతో ఆలయ ప్రాభవం తగ్గిపోతోందని భక్తులు ఆరోపించారు. సంబంధం లేని వ్యక్తులు ఆలయ వ్యవహారంలో తలదూర్చడం వల్లన ఆలయ ప్రతిష్ట దెబ్బతింటోందని చెప్పారు. ఆలయంలో పనిచేస్తున్న వంశపారంపర్య అర్చకుల వివరాలు, ప్రభుత్వ వేతనం పొందుతున్న అర్చకుల వివరాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే ఆలయంలో జరుగుతున్న అరాచకాలను అక్రమాలను అరికట్టి సమగ్ర విచారణ జరపాలని అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావును ఆదేశించారు. ఆంజనేయస్వామి ఆలయం పక్కన నిర్మించిన కళ్యాణ మండపం తాలూకు అనుమతలు వివరాలు, దాతల వివరాలు కూడా అందజేయాలని ఆదేశించారు. భక్తులను ఇబ్బందులకు గురి చేస్తే సహించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు.



భావన్నారాయణ స్వామి ఆలయంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఎంపీ లావు వినతి



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబర్,19: పల్నాడు జిల్లా వినుకొండ మండలం వెంకుపాలెంలో ఇండో - డచ్ అగ్రికల్చరల్ ప్రాజెక్ట్ కింద సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను నెలకొల్పాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు గురువారం ఢిల్లీలో కలిసి విన్నవించారు. వ్యవసాయ ఆధారిత పల్నాడులో రైతులకు మేలు కలిగేలా, పంట కోత అనంతరం ఎదురవుతున్న ఇబ్బందులని పరిష్కరించుకునేందుకుగాను కూరగాయలు, సుగంధ ద్రవ్యాలకు సంబంధించి ఇండో - డచ్ అగ్రికల్చర్ ప్రాజెక్టును నెలకొల్పాలని కోరారు. ఇందుకు వీలుగా వినుకొండ మండలం వెంకుపాలెంలో మంజూరు చేయాలని ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ ప్రాజెక్టు కోసం 25 ఎకరాల భూమి కూడా వెంకుపాలెంలో అందుబాటులో ఉందని, ప్రాజెక్టు గ్రౌండింగ్ చేశారని మంత్రికి ఎంపీ వివరించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటైతే పల్నాడు ప్రాంత రైతులకు మేలుజరగడమే కాక ఉత్పాదకతను పెంపొందించడం, పంట అనంతర నష్టాలను తగ్గించేందుకు వీలవుతుందని తెలిపారు. ఈ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టును మంజూరు చేయాలని కోరారు. రైతులకు మేలు జరిగేలా గురజాల మండలం జంగమహేశ్వరపురంలో అన్ని మౌలిక సదుపాయలతో కృషి విజ్ఞాన కేంద్రాన్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

భేష్, వంద రోజులు.. వంద విజయాలు

- గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, సెప్టెంబరు 19: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన అభివృద్ధి, సంక్షేమాల దిశగా నడుస్తోందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసి 100 రోజులు అవుతుందని తెలిపారు. రాష్ట్ర ఖజానాను జగన్ దివాళా తీయించినప్పటికీ, చంద్రబాబు వందరోజుల పాలనలో వందకు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించి కొనసాగించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచి 1వ తేదీనే ఇంటివద్దనే పంపిణీ, బకాయిలు 3 వేలు కలిపి మొదటి నెలలోనే రూ.7 వేల పింఛన్‌ను 64 లక్షల మందికి పైగా ఇవ్వడం దేశ చరిత్రలోనే తొలిసారి అని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు 16,437 ఉపాధ్యాయ నియామకాల మెగా డీఎస్సీకి ప్రకటన, 9 డీఎస్సీల ద్వారా 1996 నుండి నేటి వరకు చంద్రబాబు హయాంలో 2 లక్షల 32 వేల 179 మందికి ఉద్యోగ నియామకాలు జరిగాయని తెలిపారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువతకు ద్రోహం చేశారని విమర్శించారు. పేదవాని ఆకలి తీర్చేందుకు 100కు పైగా అన్న క్యాంటీన్ల ఏర్పాటు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచడం, అమరావతికి ప్రధాని మోడీ రూ.15 వేల కోట్లు మంజూరు చేయడం, దేశ చరిత్రలోనే ఆగస్టు 23న స్వర్ణ గ్రామ పంచాయతి పేరిట ఒకేరోజు రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం ద్వారా 4,500 కోట్ల విలువైన ఉపాధి హామీ పథకం పనులకు తీర్మానాలు చేయడం వరల్డ్ రికార్డులో నమోదు చేశారని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

వైసీపీ విలీన రాయబేరాల్లో జగన్

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ,సెప్టెంబరు19: రాష్ట్ర చరిత్రలోనే చెరగని సంక్షేమ సంతకం చేస్తున్న కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనతో వైసీపీ దిక్కుతోచని స్థితిలో పడిందని, కాంగ్రెస్ పార్టీలో విలీనం కావడం ఖాయంగా కనిపిస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే గురువారం విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి మేళవింపుగా సాగుతున్న ప్రజాకర్షక పాలనతో ఇక పుట్టగతులు ఉండవనే వైసీపీ నేతలంతా పక్క పార్టీల వైపు చూస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో పలువురు వైసీపీ నేతలు తమ సొంత గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకోగా వాళ్ళందరికంటే ముందుగా జగన్ కూడా అదే పనిలో విలీన రాయబేరాలలో బిజీగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో పార్టీ ఓడిపోయిన దగ్గర నుండి బెంగళూరులో అదే పనిలో ఉన్నట్లు పక్కా సమాచారం ఉందన్నారు. ఇలా స్వయంగా పార్టీ అధ్యక్షుడే దిక్కులేని పరిస్థితులలో కాంగ్రెస్‌లో చేరాలని చూస్తుంటే ఆ పార్టీ నాయకులు ఏ పార్టీలో చేరాలో తెలియక సందిగ్ధంలో పడిపోయారన్నారు. టీడీపీ,బీజేపి,జనసేన,కాంగ్రెస్ పార్టీలలో చేరేందుకు వైసీపీ నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారన్నారు. ఇక భవిష్యత్‌లో వైసీపీకి మనుగడ ఉండదని అన్నారు. ఏపీని దేశానికే ఆదర్శంగా కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దుతోందని, రానున్న పదిహేనేళ్లలో అద్భుతమైన రాష్ట్రంగా ఏపీ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

8 నుంచి పద్య నాటిక, సాంఘిక నాటిక పోటీలు



పోటీల వివరాలను ప్రకటిస్తున్న సినీ రచయిత సాయిమాధవ్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 19 : కళల కాణాచి, వేద గంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 8న పద్య నాటకలు, సాంఘిక నాటక పోటీల ప్రదర్శన నిర్వహించనున్నారు. గురువారం సినీ రచయిత, కమిటీ సభ్యులు బుర్రా సాయిమాధవ్, కమిటీ సభ్యులు ప్రదర్శన వివరాలు వెల్లడించారు. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరగనున్న ఈ ప్రదర్శనలు అక్టోబరు 12 వరకు కొనసాగుతాయన్నారు. 8న 'సంధ్య వెలుగు', 'మంత్రనగరి', 'చిగురు మేఘం', 9న 'అష్టమవసువు', 'స్వేచ్ఛ నేనేం చేసుకుంటాను', 'గురి తప్పిన వేట', 10న 'యుద్ధం', '27వ మైలురాయి', 'ఇది రహదారి కాదు', 'మా ఇంటిలో మహాభారతం', 11న 'చాందూ సూరజ్ ఇది అతని సంతకం', 'మతమా, మానవత్వమా', 'నా శత్రువు', 12న 'హరిలో రంగ హరి', 'రుతువు లేని కాలం' నాటికలు ప్రదర్శించనున్నారు. ప్రముఖుల పేరిట ఏర్పాటు చేసిన పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. సమావేశంలో గోపరాజు విజయ్, చెరుకుమల్లి సింగారావు, అయినాల మల్లేశ్వరరావు, గరికపాటి సుబ్బారావు, బడుగు మోహనరావు, బొల్లిముంత కృష్ణ, హకీంజాని, వెంకటేష్, భవానీ పాల్గొన్నారు.

ఆగమపరీక్షలకు నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 19 : రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆగమ పరీక్షలు-2024 దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగుస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖ ఏడీసీ కే రామచంద్ర మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20తో దరఖాస్తు ఆన్‌లైన్ ప్రక్రియ ముగుస్తుందని, 40 సంవత్సరాలు నిండిన వారికి రాత పరీక్ష నుండి మినహాయింపు ఉందని తెలిపారు. దరఖాస్తుదారులు వంద రూపాయలు ఆన్‌లైన్‌లో చెల్లించి, వారి దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

కారంపూడిలో 1 కేజీ 250 గ్రాముల గంజాయి స్వాధీనం

కారంపూడి, సెప్టెంబరు 19: మండల కేంద్రమైన కారంపూడిలో గంజాయిని విక్రయిస్తున్న కాల్వ మహేష్ అనే వ్యక్తిని బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ టీవీ శ్రీనివాసరావు తెలిపారు. మహేష్‌ను విచారించగా తాను మాచర్ల పట్టణానికి చెందిన లక్ష్మీ శివనాగమణి వద్ద గంజాయిని తీసుకొచ్చినట్లు చెప్పడంతో, ఆమెను కూడా అదుపులోకి తీసుకున్నామని, వారివురి నుంచి 1 కేజీ 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గురజాల సివిల్ కోర్టులో హాజరుపరుచగా న్యాయాధికారి కేవీవీ సత్యనారాయణ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. కారంపూడిలో గంజాయి అధికంగా ఉందని తమ దృష్టికి వచ్చిందని, దీనిపై తమ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, గంజాయి విక్రయదారులందరినీ త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ చెప్పారు.

ఇంటి కప్పు కూలి వృద్ధురాలు దుర్మరణం

గుంటూరు, సెప్టెంబరు 19: ఇటీవల కురిసిన వర్షాలకు నానిపోయి ఉన్న పాత ఇల్లు కూలి ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైన సంఘటన గుంటూరు, అర్.అగ్రహారంలోని అడపా బజారులో గురువారం జరిగింది. అడపా బజారుకు చెందిన అడపా సూరమ్మ (80), కుమారుడు శ్రీనివాసరావుతో కలిసి తమ సొంత పాత ఇంట్లో నివసిస్తోంది. గురువారం ఉదయం ఇంటి పైకప్పు కుప్పకూలి పోయింది. అదే సమయంలో తల్లి, కుమారుడు అక్కడే ఉండటంతో పైకప్పుతో పాటు సిమెంటు పెళ్ళలు వారిపై పడి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌లో క్షతగ్రాతులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలపాలైన సూరమ్మ చికిత్స పొందుతూ గంటల వ్యవధిలోనే మృతి చెందింది. శ్రీనివాసరావు కొద్దిపాటి గాయాలతో బయట పడ్డాడు. స్థానికంగా నివసిస్తున్న మాజీ కార్పొరేటర్ అడపా కాశీవిశ్వనాథ్ ఈ సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. పశ్చిమ తహశీల్దార్ ఫణీంద్రబాబుకు సమాచారం అందించారు. తహశీల్దార్ సంఘటనా ప్రదేశానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. పోస్టు మార్టం అనంతరం సూరమ్మ భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.





మృతురాలు సూరమ్మ

నిందితుల అరెస్టు - బంగారం స్వాధీనం



నిందితులను చూపిస్తున్న డీఎస్పీ హనుమంతరావు, సీఐ సురేష్

సత్తెనపల్లి, సెప్టెంబరు 19 : ఒంటరి, వృద్ధ మహిళల నగదు దోపిడీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెల్లంకొండ మండలం నాగిరెడ్డి పాలెంకు చెందిన బత్తుల సిసింద్రి, బండారు వీరబ్రహ్మం, ఉస్తెల దావీదులు ముఠాగా ఏర్పడ్డారు. నాగిరెడ్డిపాలెంలో వృద్ధ మహిళపై కత్తితో దాడి చేసి 25 గ్రాముల బంగారు గొలుసును దోచుకు వెళ్ళారని, నకరికల్లు మండలం నరసింగపాడులో పొలంలో గేదెలను మేపుతున్న ఒంటరి మహిళ వద్దకు వచ్చి కత్తితో బెదిరించి 36 గ్రాముల బంగారపు నాను తాడును దొంగిలించుకు వెళ్ళారని,గుండ్లపల్లిలో పొలంలో గడ్డి కోసు కుంటున్న మహిళ వద్దకు వెళ్ళి కత్తితో బెదిరించి 23 గ్రాముల బంగారు నాను తాడును దోచుకు వెళ్లిన ఘటనల గురించి ఆయన వివరించారు. నిందితుల నుంచి కత్తి, మోటారు సైకిల్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పెద కూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ సురేష్, బెల్లంకొండ ఎస్ఐలు రాజాల పర్యవేక్షణలో ఈ ముగ్గురిని అరెస్టు చేసి నగలను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఆయన తెలిపారు.

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి క్రైం, సెప్టెంబరు 19 : రైలు నుండి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెనాలి జీఆర్‌పీ ఎస్ఐ జీ.వెంకటాద్రి గురువారం తెలిపారు. తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో కొలకలూరు-దుగ్గిరాల రైల్వే స్టేషన్స్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారంతో వెళ్లి పరిశీలించగా 30-35 సంవత్సరాల వయసు గల వ్యక్తి రైలు నుండి జారి పడి మృతి చెందినట్లు గుర్తించినట్లు చెప్పారు. మృతుడి శరీరంపై సిమెంట్ రంగు ప్యాంటు, బిస్కెట్ కలర్ టీషర్ట్ ఉన్నాయి. మృతుడికి సంబంధించి ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121,129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

మంగాపురం క్యాంప్‌లో వాటర్ ట్యాంక్ పంపు ఆపరేటర్

తమ్మినేడి ఆదిలక్ష్మి ఆదర్శనీయం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 19: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని మంగాపురం క్యాంప్‌లో గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంక్ పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న తమ్మినేడి ఆదిలక్ష్మి అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. గత దశాబ్దకాలంగా గ్రామంలోని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో ఆమె ప్రముఖ పాత్ర పోషిస్తోంది. కుటుంబ పోషణ కోసం బరువైన బాధ్యతలను ఆమె నిర్వర్తిస్తోంది. మునుపటి వరకు నీటిని శుద్ధి చేసేందుకు కేవలం క్లోరిన్ మాత్రమే కలిపేవారు. అందుకోసం ఆదిలక్ష్మి చాలా ప్రయాసపడాల్సి వచ్చేది. అయితే, ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పని చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డివైజర్ యంత్రాన్ని చక్కగా వినియోగిస్తూ నీటి శుద్ధీకరణ ప్రక్రియను తూ.చా. తప్పకుండా పాటిస్తున్నారు. దీంతో మంగాపురం క్యాంపులోని 80 శాతంకు పైగా ప్రజలు తాగునీటికి శుద్ధిచేసిన వాటర్ ట్యాంక్ నీటినే వాడుతున్నారు. విధుల్లో ఎంతో శ్రద్ధ చూపుతున్న ఆదిలక్ష్మికి మంచిగుర్తింపు వచ్చింది. ఎలా అంటే.. ఆమె శ్రద్ధను గమనించిన గ్రామీణ నీటి సరఫరాశాఖ విభాగం మంగళవారం ఢిల్లీలో సెమినార్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెమినార్‌కు రాష్ట్రం తరపున ఆదిలక్ష్మి ఒక్కరే హాజరయ్యారు. వాటర్ ట్యాంక్ పంపు ఆపరేటర్‌గా పనిచేస్తూనే ఆదిలక్ష్మి తీరిక వేళల్లో పొలం పనులు, పొదుపు సంఘం మహిళగా వుంటూ గ్రామంలో నీటి శుద్ధీకరణపై అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తోంది.మధ్యప్రదేశ్ నుండి స్వప్న అనే ఆశ కార్యకర్త, రాజస్థాన్ నుండి సర్పంచ్ సీతారామ్ హాజరయ్యారని ఆదిలక్ష్మి తెలిపారు.



ఢిల్లీ సెమినార్‌లో మాట్లాడుతున్న తమ్మినేడి ఆదిలక్ష్మి

అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తా

ప్రభుత్వ అధికారులు ఆదేశిస్తూ అన్ని గ్రామాల్లో డివైజర్ యంత్రం ద్వారా నీటిని క్లోరినేషన్ చేసే విధానంపై అవగాహన కల్పిస్తానని ఆదిలక్ష్మి చెప్పారు. గత పద్దెనిమిదేళ్లుగా తమ గ్రామంలో పంపు ఆపరేటర్‌గా సేవే పరమావధిగా పనిచేస్తున్నానని, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీ నుండి ఢిల్లీలో జరిగిన నీటి శుద్ధీకరణపై జరిగిన సెమినార్‌కు హాజరు కావడం మరింత అవగాహన కలిగిందని చెప్పారు.



మంగాపురం క్యాంప్‌లో పంపు ఆన్‌చేస్తున్న ఆదిలక్ష్మి

51,876 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 54,260 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,876 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,459 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి. .

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	17200	334	9000	16000
నెంబరు.5	8500	14000	నెంబరు. 5	10100	16000
273	12500	14000	273	12500	14000
341	8000	17000	341	10000	16000
4884	14000	16000	4884	9000	15300
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18700	తేజ	9000	18600
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	9000	15500
దేవనూరు డీలక్స్	8500	14500	దేవనూరు డీలక్స్	10000	16000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5500	11000

పల్నాడు వార్తలు

మాచర్ల గురజాల సత్తెనపల్లి పెదకూరపాడు



ముళ్ల కంపలతో రహదారి, మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే చొరవతో రహదారికి మరమ్మతులు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 19: మాచర్ల - విజయపురిసౌత్ రహదారిపై గుంతలు పడడంతో పాటు రహదారికి ఇరువైపులా ముళ్ల కంపలు పెరిగి ఉండటంతో వాహనదారులు ఈ రహదారిలో తరచూ ప్రమాదాలకు గురవు తున్నారు. విషయం తెలుసుకున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి స్పందించి అధికారులను రహదారి మరమ్మతులకు ఆదేశించారు. దీంతో అధికారులు గురువారం మరమ్మతులు చేపట్టారు. అలాగే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాలతో రూ. 31 కోట్లతో మాచర్ల - విజయపురిసౌత్ రహదారిని డబుల్ లైన్‌గా మార్చేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.

కాంపౌండర్ గురవయ్య సేవలు ఆదర్శనీయం

● మున్సిపల్ చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, సెప్టెంబరు 19: కాంపౌండర్ గురవయ్య సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. పట్టణంలోని ఓ విద్యాసంస్థలో గురువారం మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కాంపౌండర్ పల్లెబోయిన గురవయ్య సంతాపసభ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నరసింహారావు, విశ్రాంత డీవైఈవో గాదె రామకృష్ణారావు, డాక్టర్ కమలాసరావు, న్యాయవాదులు కేశం శ్రీనివాసరావు, జి వెంకటేశ్వర్లు, కుర్రి సాయిమార్కొండారెడ్డి, కౌన్సిలర్ మదార్‌సాహెబ్ తదితరులు కాంపౌండర్ గురవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపికలు

వెల్దుర్తి, సెప్టెంబరు 19: మండలంలోని శిరిగిరిపాడు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి బాలికల అండర్ - 17, అండర్ - 14 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించి విద్యార్థినులను మండలస్థాయి నుంచి నియోజకవర్గస్థాయికి ఎంపికచేశారు. సెలక్షన్ కమిటి సభ్యులుగా హెచ్ఎం పద్మ, ఇన్‌చార్జి హెచ్ఎం శీలం వెంకటేశ్వర్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం నాగేశ్వరరావు, మండాది జడ్పీహెచ్ హెచ్ఎం వేణుగోపాలరావు, శిరిగిరిపాడు ఆశ్రమ పాఠశాల పీడీ శివపుణ్యవతి, మోడల్‌స్కూల్ పీడీ రత్నరాజు, వెల్దుర్తి కేజీబీవీ పీడీ అనూష వ్యవహరించారు.



లెమన్ స్పూన్ ఆటల పోటీలలో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు

మహిళా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 19: యూటీఎఫ్ స్వర్ణోత్సవ క్రీడా సంబరాల్లో భాగంగా మూడు రోజులుగా స్థానిక జడ్పీ హైస్కూల్లో యూటీఎఫ్ పిడుగురాళ్ల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. గురువారం వివిధ పాఠశాలల మహిళా ఉపాధ్యాయులకు మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, రన్నింగ్ రేస్ వంటి క్రీడలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారిని యూటీఎఫ్ నేతలు జీ.విజయసారథి, బాగేశ్వరిదేవి, పాఠశాలల హెచ్ఎంలు ధనలక్ష్మీ, పద్మ బాయి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జమాల్, వీ.నాగేశ్వరరావు, ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు, సాంబశివరావు, సాయిబాబా, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

'న్యూటన్స్'లో మెగా రక్తదాన శిబిరం

మాచర్లటౌన్, సెప్టెంబరు 19: పట్టణ శివారులోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం వాసవీక్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వీ204ఏ గవర్నర్ శివ సుబ్రహ్మణం ఈశిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ముందుగా శివ సుబ్రహ్మణ్యం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, క్యాబినేట్ సెక్రటరీ సత్యనారాయణ, రీజియన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ వంకాయల కృష్ణారావు, మాచర్లశాఖ కార్యదర్శి పందిరి నరసింహారావు, ఉప కార్యదర్శి బచ్చు రాజ్‌కుమార్, కోశాధికారి చుండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమం తనిఖీ

నకరికల్లు, సెప్టెంబరు 19 : కుంకలగుంట పీహెచ్‌సీలో గురువారం అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహించగా, వైద్య ఆరోగ్య శాఖ స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ తహసీనా టీకా కార్యక్రమాన్ని గురువారం తనిఖీ చేశారు. అలాగే రెడ్డిపాలెం, రొంపిచర్ల పీహెచ్‌సీలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన షుగర్ వ్యాధిగ్రస్తులు, పొగ తాగే అలవాటు ఉన్న వారు అడల్ట్ బీసీజీ టీకాను వేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ కండ్లకుంట మురళీకృష్ణ, కుంకలగుంట మెడికల్ అధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు, హెచ్‌బీ ప్రశాంత కుమారి, ఎంపీహెచ్‌ఈవో కొంపల వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి వెండి నాగాభరణం..

నకరికల్లు, సెప్టెంబరు 19 : కుంకలగుంట గ్రామంలోని భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలోవున్న కాశీవిశ్వేశ్వర స్వామికి లక్ష్మీశెట్టి వెంకట భవానీశంకర్ పవన్ కుమార్ ధర్మపత్ని చెన్నకేశ్వరి దంపతులు సుమారు రూ.లక్షవిలువైన వెండినాగాభరణాన్ని బహూకరించారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులకు నాగాభరణాన్ని అందజేశారు. అలాగే రూ.20 వేల విలువైన ఇత్తడి ఆభరణాన్ని దమ్మవళం అంకారావు, లక్ష్మి దంపతులు అందజేశారు. కార్యక్రమంలో అర్చకస్వామి ఎం విశ్వనాథ శాస్త్రి, ఆలయ కమిటీ సభ్యుడు మహంకాళిరావు పాల్గొన్నారు.



వెండి నాగాభరణం



గుంటూరుకు చెందిన జొన్నాదుల ప్రభాకరరావు జ్ఞాపకార్థం ఆయన భార్య పుష్పవేణి, కుటుంబ సభ్యులు రూ.60 వేలు విలువైన మినరల్ వాటర్ కూలర్‌ను సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి వితరణగా అందజేశారు. సూపరింటెండెంట్ లక్ష్మణరావు ఆ వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. - **సత్తెనపల్లి**

పంచాయతీలకు పూర్వ వైభవం తెస్తాం

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

● నందిగామలో అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపన



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 19 : గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకువస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని నందిగామలో గురువారం అనంతరం రూ.43 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని కన్నా ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలతో అప్రోచ్‌రోడ్డు, మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించి వాటిని పునర్జీవింప చేసిందన్నారు. గ్రామాభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల అమరేశ్వరరావు, పార్టీ నేతలు మక్కపాటి రామచంద్రరరావు, బండారుపల్లి నరసింహారావు, కోమటినేని శ్రీనివాసరావు, యర్ర వెంకటేశ్వరరావు, చౌట శ్రీనివాసరావు, లగడపాటి గజానన, గద్దె అప్పారావు, పుట్టి హనుమంతరావు, షేక్ నన్నే సాహెబ్, పచ్చ సుధీర్, మండడపు సాంబశివరావు, వక్కంటి అజయ్, పుట్టా చలమయ్య, నువ్వుల రాంబాబు, తాతినేని రంగా, కేదార్‌నాథ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో..

నందిగామ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ ప్రతినిధులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో 115ను రద్దు చేయాలి.. ఎమ్మెల్యే కన్నాకు నర్సుల వినతి

సత్తెనపల్లి : సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలకు స్టాఫ్ నర్సులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గత ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో 115ను రద్దు చేయించాయాలని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం అందించారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సు చదివి తాము సేవలు అందిస్తున్నామని, జీవో 115తో భవిష్యత్‌లో తాము రెగ్యులర్ అయ్యే పరిస్థితి కన్పించటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి 115 జీవోను రద్దు చేయాలని కోరారు.

పీఎం ఆవాస్ యోజన గృహాలు ప్రారంభం

నకరికల్లు : మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద పూర్తయిన గృహాలను గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే రూ 1.10 కోట్లను శ్రీనిధి కింద, బ్యాంక్ లింకేజీ రుణాల కింద స్వయం సహాయక సంఘాలకు అందించారు. సీసీ రోడ్లకు, మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సుస్థిర అభివృద్ధికి, సంక్షేమానికి కృషిచేస్తుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే ప్రజలకు సంక్షేమ పాలనను అందించిందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, టీడీపీ నేతలు అహమ్మద్ బుడే, కరాలపాటి వలి, సాగి శ్రీను, మొక్కపాటి రామచంద్రరరావు, ఎంపీపీ ఎం అనురాధ, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, తహసీల్దార్ పుల్లారావు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

24న సర్వసభ్య సమావేశం

మాచవరం, సెప్టెంబరు 19 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాదు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ దారం అమ్ములమ్మ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తగు సమాచారంతో తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

నేటి నుంచి 'ఇది మంచి ప్రభుత్వం'

మాచవరం, సెప్టెంబరు 19 : రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి ఈనెల 20 నుంచి 27 వరకు ఇంటింటికి ప్రచారం నిర్వహించనున్నది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మండలంలోని పిన్నెల్లి గ్రామానికి శుక్రవారం రానున్నారని ఎంపీడీవో ప్రసాదు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొని ఈ కార్యక్రమానికి జయప్రదం చేయాలని ఎంపీడీవో కోరారు.

మాచర్లటౌన్: వంద రోజుల పాలనా ప్రగతికి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈనెల 20న మాచర్ల పట్టణంలోని 22వ వార్డు, 21న కారంపూడి పట్టణం, 22న మాచర్ల మండలంలోని అమ్మాని జమ్మలమడక, 23న రెంటచింతల మండలంలోని పశర్లపాడు, 23న దుర్గి మండలంలోని ముటుకూరు, 25న వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడు, 26న మాచర్ల పట్టణంలోని 16, 17 వార్డుల్లో పర్యటించనున్నారు.

సత్తెనపల్లి: ఈనెల 20 నుంచి ఇది మంచి ప్రభుత్వం నినాదంతో ఆరు రోజుల పాటు నియోజక వర్గంలో ఇంటింటికి వెళ్ళి ప్రజలను కలుస్తామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు కోరుకున్న వంద రోజుల పాలనలో ఎన్నో మంచి పనులను కూటమి ప్రభుత్వం చేసిందన్నారు. ప్రజలకు సుపరిపాలన అందిస్తూ వ్యవస్థలకు ఊపిరి పోస్తుందన్నారు.

సమయపాలన పాటించాలి

రెంటచింతల,సెప్టెంబరు 19 : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో మహాలక్ష్మి ఆదేశించారు. గురువారం గోలి సచివాలయాన్ని ఆమె సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల్లోనే ఉండి ప్రజలు అందించే అర్జీలను స్వీకరించి, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో

డీఏవీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

దాచేపల్లి, సెప్టెంబరు 19: రాష్ట్ర స్థాయిలో జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీలలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ భవ్య సిమెంట్స్ డీఏవీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13, 14 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించిన ఈ పోటీలలో అండర్-14 బాలుర కబడ్డీలో మొదటిస్థానం, అండర్-17 బాలికల వాలీబాల్ విభాగంలో ద్వితీయస్థానం, 200, 800 మీటర్ల అండర్-14 పరుగుపందెంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ విభాగాలలో పాఠశాల నుండి మొత్తం 15 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సంద్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మర్రి కొండలు, విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులను భవ్య సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ వెంకటరాజు, యూనిట్ హెడ్ బాబా ఫక్రుద్దీన్‌లు అభినందనలు తెలియజేశారు.

గ్రామాలకు తాగునీటిని అందించాలి

దుర్గి, సెప్టెంబరు 19: మండలంలోని ఆత్మకూరు వద్ద గల పంప్ హౌస్ నుంచి తాగునీటిని వెంటనే అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పేరుపోగు రామయ్య గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. సుమారు 10 వేల జనాభా కలిగిన ఆత్మకూరు, ముటుకూరు, పోలేపల్లి, నెహ్రూనగర్ తండాలకు నాలుగు నెలలుగా నీటిని అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దీనిపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించి గ్రామాలకు తాగునీటిని అందించాలని రామయ్య కోరారు.

21 నుంచి క్రీడా పోటీల్లో ఎంపికలు

దుర్గి, సెప్టెంబరు 19: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈనెల 21 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు జరగనున్నట్లు హెచ్ఎం కోటేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగ, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని తమ ఎంట్రీ ఫారమ్స్‌తో పాల్గొనాలని మండల క్రీడా కో-ఆర్డినేటర్ బండ్ల ప్రసాద్ కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

మాచర్లటౌన్, సెప్టెంబరు 19: పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో గురువారం నరసరావుపేట మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ యనమదల వెంకట్రామయ్య మ్యాక్సీ విజన్ హాస్పిటల్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

33 కేవీ విద్యుత్ లైను ప్రారంభం

గురజాలటౌన్, సెప్టెంబరు 19: గురజాల పట్టణంలో గురువారం 33కేవీ విద్యుత్ లైన్‌ను విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యుత్ లైన్ వలన గురజాల, పులిపాడు, దైద సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయ సరఫరా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ విద్యుత్ లైన్ పట్టణంలోని సంగం డెయిరీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మస్తాన్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

గురజాలటౌన్, సెప్టెంబరు19: మండల పరిధిలోని రైతులు సాగు చేసిన పంటలకు పంట నమోదు చేయించుకోవాలని ఏవో సంధ్యారాణి తెలిపారు. గురువారం ఆమె మండలంలోని పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఈనెల 23 లోపు ఈ-పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. తగు పత్రాలను అందించి పంటనమోదు చేయించుకోవాలని రైతు లకు ఏవో సంధ్యారాణి సూచించారు.

దాచేపల్లి: ఈ నెల 23లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వం అందించే పథకాలు అందుతాయని దాచేపల్లి మండలవ్యవసాయశాఖ అధికారి పాపకుమారి అన్నారు. గురువారం గామాలపాడు రైతు సేవా కేంద్రంలో ఆమె రైతులకు పత్తిలో సూక్ష్మ పోషకాల వినియోగంపై అవగాహన కల్పించారు.

రాజుపాలెం: రైతులు రసాయనిక, క్రిమి సంహారకాల వాడకాన్ని తగ్గించి సేంద్రిక వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని మండల వ్యవసాయ అధికారి వెంకట నరసయ్యకోరారు. గురువారం మండలంలోని కోటనెమలిపురి గ్రామంలో వరి గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని వివరించారు. మండలంలోని రైతులందరు తప్పకుండా ఈ నెల 23వ తేదీ లోపు పంట నమోదు, ఈకేవైసీలను త్వరితగతిన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ జయలక్ష్మీ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువు దెబ్బతింటోంది


● ఉన్నతాధికారులు జోక్యం చేసుకోండి

దాచేపల్లి, సెప్టెంబరు 19: పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య ఏర్పడిన వివాదంతో విద్యార్థుల చదువు దెబ్బతింటుందని రాష్ట్ర ఎరుకుల కులవృత్తుల సంఘం అధ్యక్షులు కండెల అంజి ఆరోపించారు. దాచేపల్లి నగర పంచాయతీలోని ఎస్టీ కాలనీలోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంతోపాటు నలుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. హెచ్ఎం తమను ఇబ్బంది పెడుతున్నారంటూ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులంతా కలిసి తనను ఇబ్బంది పెడుతున్నారని హెచ్ఎం ఇలా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ పిల్లలకు చదువు చెప్పడంలేదని, దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ విషయాన్ని ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.


ఇసుక కోసం క్యూ..

● పడిగాపులు పడుతున్న లారీ డ్రైవర్లు

అచ్చంపేట, సెప్టెంబరు 19 : మండలంలోని మాదిపాడు వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌లో గురువారం ఇసుక కోసం లారీలు క్యూ కట్టాయి. ఆ స్టాక్ పాయింట్ వద్ద 24 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంది. గత నెల 28 నుంచి ఇసుక రవాణా నిలిచి పోగా శుక్రవారం నుంచి ఆన్‌లైన్ విధానం ద్వారా ఇసుక అమ్మకాలు జరిగే అవకాశముందని లారీ డ్రైవర్లు చెబుతున్నారు. దీంతో ఇసుక కోసం వందలాది లారీలు స్టాక్ పాయింట్ వద్ద సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల వర్షాలు కురవటంతో లోడింగ్ పూర్తిస్థాయిలో నిలిచి పోవటంతో లారీ డ్రైవర్లు 24 రోజులుగా ఇసుకకోసం పడిగాపులు కాస్తున్నారు. సుదూర ప్రాంతాలైన మార్కాపురం, దోర్నాల, కారంపూడి తదితర ప్రాంతాల నుంచి కూడా లారీలు వచ్చాయి. ఆన్‌లైన్ ఇసుక విధానం అమల్లోకి రావటంతో ముందుగా వచ్చిన తమకు ఇసుక అందుతుందో లేదో అంటూ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మాదిపాడు స్టాక్‌పాయింట్ వద్ద నిల్వ ఉన్న ఇసుక



ఇసుక కోసం బారులు తీరిన లారీలు



చుక్కల భూముల వివరాలు తెలుసుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమొదిని సింగ్

చుక్కలు, అసైన్డ్ భూముల రీ వెరిఫికేషన్

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమొదిని సింగ్

పెదకూరపాడు, సెప్టెంబరు 19 : నియోజక వర్గంలో ఫ్రీ హోల్డ్ చుక్కల భూములు, అసైన్డ్ భూముల వివరాలను రీ వెరిఫికేషన్ చేస్తున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమొదిని సింగ్ తెలిపారు. గురువారం పెదకూరపాడులోని తహసీల్దారు కార్యాలయంలో స్థానిక అధికారులతో ఆమె సమావేశమై చుక్కల భూములు, అసైన్డ్ భూములపై వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మీసాల డానియేలు, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరావు, సబ్ రిజిస్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయాన్ని

రైతుల ఖాతాల్లో జమ చేయాలి

పెదకూరపాడు, సెప్టెంబరు 19 : అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలును రైతుల ఖాతాల్లో జమ చేయాలని జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు కోరారు. గురువారం రైతులతో కలసి తహసీల్దార్ మీసాల ప్రభుదాసుకు వినతి పత్రం అందించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలోని పలు మండల గ్రామాల్లో పత్తి రైతులతో పాటు మరి కొంత మంది రైతులు కూడా తీవ్రంగా నష్ట పోయారని వివరించారు. వరదల కారణంగా నష్ట పోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు ప్రభుత్వం ప్రకటించటం మంచి పరిణామమని, కనీసం రూ.20 వేలు ఇస్తేనే రైతుకు ఉపశమనం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రైతులు ఎస్ వెంకటేశ్వర్లు, ఎం నరసింహారావు, పీ వెంకటరావు, పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 19: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సరోజినిదేవి అన్నారు. మండలంలోని తాళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, హెచ్ఎం శ్రీనునాయక్, సంఘమిత్ర రీసెర్చ్ ట్రైనింగ్ కన్సల్టెన్సీ మేనేజర్ ఎం కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గురజాలటౌన్: మండలంలోని పల్లెగుంతలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, టీడీపీ నేతలు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జాస్తి ప్రకాష్, వెంకట్రామయ్య, పున్నయ్య, సర్పంచ్ స్వరాజ్య లక్ష్మి, ఐటీసీ ఆఫీసర్ గురుప్రసాద్, పంచాయతీ సెక్రటరీ గురుప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మాచర్ల విద్యార్థి

మాచర్లటౌన్, సెప్టెంబరు 19: పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థి అగస్త్య ఆనంద్ (8వ తరగతి) జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తుమ్మ సుజాత తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో అనంతపురంలోని ఎస్కే యూనివర్సిటీలో ఉమ్మడి 13 జిల్లాల సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎంపికలు నిర్వహించగా అగస్త్య ఆనంద్ ఎంపికైనట్లు తెలిపారు. నవంబరు 8 నుంచి 12 వరకు జమ్మూకాశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో అగస్త్య ఆనంద్ పాల్గొననున్నట్లు తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థి అగస్త్య ఆనంద్‌ను ప్రిన్సిపాల్ సుజాత తోపాటు పీఈటీ మత్తేకుమార్, ప్రతాప్, ఉపాధ్యాయులు అభినందించారు.

నాగులేరు వంతెనపై గుంతలు పూడ్చివేత

కారంపూడి, సెప్టెంబరు 19: మండల కేంద్రమైన కారంపూడి శివారులోని మంత్రాలమ్మ గుడి వద్ద గల నాగులేరు బ్రిడ్జిపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రెండు రోజులుగా బ్రిడ్జిపై గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ఫ్యాక్టరీ మేనేజర్ మురళీకృష్ణ, అడ్వైజర్ రాజేంద్రప్రసాద్, సెక్యూరిటీ ఆఫీసర్ లింగమూర్తి, టీడీపీ నేత చప్పిడి రాము, చావా వీరాంజనేయులు పర్యవేక్షిస్తున్నారు.

గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 19 : హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హిమబిందు హాస్పటల్, సాయి కృష్ణ డెంటల్ కేర్ వైద్యులు హిమబిందు, తేజశ్వనీలు విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఆరోగ్యంపట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు, విద్యా కమిటీ చైర్మన్ రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో పోషకాహార మాసోత్సవం

అచ్చంపేట, సెప్టెంబరు 19: మండలంలోని రుద్రవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం పోషకాహార మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది కిషోర బాలికలకు బలహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం గురించి వివరించారు. కిషోర బాలికలకు హెచ్‌పీ పరీక్షలు నిర్వహించారు. చిరుధాన్యాలు, బెల్లం, ఆకు కూరలు ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలని, దాని ద్వారా రక్త హీనత రాకుండా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ మాణిక్యమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో కిషోర బాలికలతో కలసి పోషకాహార మాసోత్సవ అవగాహన ర్యాలీని నిర్వహించారు.



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికలు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

పెదకూరపాడు, సెప్టెంబరు 19: క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకట రమణ అన్నారు. పెదకూరపాడులోని జీఆర్ సీఆర్‌కే చైతన్య స్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జీఆర్ సీఆర్‌కే చైతన్య స్కూల్ డైరెక్టర్ గుత్తా రాము, నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సీహెచ్ వెంకట నాగరాజు, మేడం సాంబశివరావు, పీఈటీ అరుణ శ్రీ, యర్రాకుల పూర్ణ, ఎం అజయ్, పలువురు పాల్గొన్నారు.

అచ్చంపేట: స్థానిక జడ్పీ హైస్కూల్లో మండల స్థాయి క్రీడా పోటీలను హెచ్ఎం సీహెచ్ కళ్యాణి ప్రారంభించారు. ఈ పోటీల్లో మాదిపాడు జడ్పీ హైస్కూల్, తాళ్ళచెరువు, కస్తూర్బా బాలికల పాఠశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాల, అచ్చంపేట హైస్కూలు, వేల్పూరు, కొండూరు గ్రామాల్లోని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 14, 17 సంవత్సరాల బాల బాలికల మండల జట్టును ఎంపిక చేసినట్టు మండల ఆటల పోటీల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆలపాటి సుజాత తెలిపారు. ఈ మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, షటిల్ బాడ్మింటన్, మండల జట్లు ఎంపిక జరిగాయి.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



సమావేశంలో పాల్గొన్న టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ తదితరులు

నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి

తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

● టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 19: నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ దేవాలయాలలో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనీస వేతనం రూ.25వేలు ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న అన్ని దేవాలయాలలో నాయీ బ్రాహ్మణులను కమిటీ సభ్యులుగా నియమిస్తారని ప్రకటించడం అభినందనీయం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రద్దుచేసిన నాయీబ్రాహ్మణులకు చెందిన అన్ని జీవోలను మళ్ళీ అమలులోకి తెచ్చేలా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని అన్నారు. కార్పొరేట్ సంస్థల స్థాయిలో సెలూన్లు ఏర్పాటుకు ప్రోత్సాహాలను అందిస్తామని, షాపులకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పారు. పోలీస్ బార్బర్, హాస్పటల్ బార్బర్ పోస్టుల నియామకం కోసం ఇచ్చిన జీవో 26ను అమలయ్యేలా కృషిచేస్తామన్నారు. పంచాయతీ, మునిసిపల్ కాంప్లెక్సులలో నాయీ బ్రాహ్మణులకు షాపులు కేటాయిస్తామని, అన్ని జిల్లా కేంద్రాలలో బ్యూటీషియన్ కోర్సులు, సంగీత కాలేజీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు 1986లో నాయీబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.కోటి నిధులతో ఫెడరేషన్ ఏర్పాటు చేశారని, ఆ ఫెడరేషన్‌కు చంద్రబాబు నాయుడు రూ.70 కోట్లు నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా సేవాసమితి కన్వీనర్ కూరపాటి రఘురామయ్య, వక్కలగడ్డ రాఘవ, దమ్మాలపాటి వరప్రసాద్, కొండేపాటి శివరాంప్రసాద్, టెంపల్లి శ్రీనివాసరావు, రావిపాటి ప్రసాద్, గందం నరసింహారావు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తదితరులు

ఆట్యా పాట్యాలో వాగ్దేవి జూనియర్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 19: కర్నూలు జిల్లా డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన అంతర్ జిల్లాల ఆట్యాపాట్యా జూనియర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ మీట్‌లో పల్నాడు జిల్లా టీమ్ ప్రతిభ కనబరచి మొదటి స్థానం సాధించారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. అయితే పల్నాడు జిల్లా టీమ్ నుంచి వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఐదుగురు ప్రాతినిధ్యం వహించారన్నారు. బాలికల విభాగంలో పసుపులేటి తిరుపతమ్మ, కొత్త సరిత, బాలుర విభాగంలో కాసా శ్రీనివాసరావు, ధనవరపు త్రినాద్, షేక్ అల్‌మాస్ ఉన్నారన్నారు.

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 29న 5కే వాక్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 19: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఈ నెల 29న ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు 5కే వాక్ నిర్వహిస్తున్నామని మహాత్మాగాంధీ హాస్పటల్స్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ అసుపత్రిలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వరల్డ్ హార్ట్‌డే ప్రధాన ఉద్దేశ్యం ప్రతి ఒక్కరు గుండె జబ్బులపై అవగాహన పెంచుకొని గుండె జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవటం కోసమేనన్నారు. 5కే వాక్ పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం నుంచి బైపాస్ రోడ్డు, రెడ్డి కాలేజీ, మల్లమ్మ సెంటర్ మీదగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంకు చేరుకుంటుందన్నారు. 5కే వాక్‌లో పాల్గొనటానికి పేర్లు నమోదు చేసుకునే మొదటి రెండు వేల మందికి రూ.500లు విలువ చేసే టీ షర్ట్, క్యాప్ ఉచితంగా అందజేస్తామన్నారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఎం.మల్లారెడ్డి 9502304422, పీవీ సుబ్బారావు 6300184095, ఎం.వెంకట గోపిరెడ్డి 8309797392 నంబర్లను సంప్రదించాలన్నారు. నమోదు చేసుకున్న వారిలో లక్కీడ్రాలో ఎంపికచేసిన నలుగురికి ఒక్కొక్కరి రూ.10 వేలు విలువ చేసే బీఎస్‌ఏ ఎస్‌ఎల్‌ఆర్ సైకిల్ అందజేయడం జరుగుతుందన్నారు. 29న 5కే వాక్‌లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని గుండె జబ్బులపై అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు వచ్చిన న్యాయవాది పొన్నవోలు

వినుకొండ, సెప్టెంబరు 19: పట్టణంలో జూలై 17వ తేదీన వైసీపీ కార్యకర్త రషీద్ హత్యకు గురయ్యాడు. ఈ కేసుపై వాదనలు విన్పించడానికి వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి గురువారం వచ్చాడు.



ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

అండర్-14, అండర్ -17 క్రీడా జట్లకు విద్యార్థుల ఎంపిక

వినుకొండ టౌన్, సెప్టెంబరు 19: ఎస్‌జీఎఫ్‌ఐ మండలస్థాయి ఆటల పోటీలను స్థానిక లయోలా ఉన్నత పాఠశాలల్లో, పాఠశాల ఫాదర్ రవి గురువారం ప్రారంభించారు. పోటీల్లో నియోజకవర్గంలోని వివిధ హైస్కూల్ నుంచి సుమారు 400 మంది విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, కోకో, బ్యాట్‌మెంట్, యోగా, చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ, విద్యార్థులను అండర్-14, 17 జట్లకు ఎంపిక చేశారు. శుక్రవారం అథ్లెటిక్స్ జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు వై.ఏసుమంద, సుధారాణి, అంకారావు, పాపారావు, కొండలు, ప్రైవేట్ పాఠశాలకు చెందిన పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో

శంకరభారతీపురం విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని లింగంగుంట్ల లోని శంకరభారతీపురం జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన విద్యార్థులు పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పార్వతి తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ యూత్‌ఫెస్ట్ 2024-2025లో భాగంగా విద్యార్థినీ, విద్యార్థుల అవగాహన కోసం తాడేపల్లిలోని కేఎల్ యూనివర్శిటీలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 26 జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొనగా శంకరభారతీపురం హైస్కూలుకు చెందిన విద్యార్థులు బి. శ్రావణి (8వ తరగతి), జి.నాగశ్రీ (9వ తరగతి), రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను, విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించిన సూరిబాబును పాఠశాలలో అభినందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

పట్టించుకోని అధికారులు



శివయ్య స్థూపం సెంటర్‌లో ప్రమాదకరంగా కిందకు ఉన్న విద్యుత్ వైర్లు, ముట్లగుంట కాలనీలో రెండు అడుగుల ఎత్తులో చేతికి అందేలా ఉన్న విద్యుత్ ట్రాన్సుఫార్మర్

వినుకొండ, సెప్టెంబరు 19: పట్టణంలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రధానంగా పట్టణ నడిబొడ్డున శివయ్య స్థూపం సెంటర్ మొదలు కొని, పల్నాడు రోడ్డు, నరసరావుపేట రోడ్డు, మార్కాపురం రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలకు వేలాడే విద్యుత్ వైర్లు, కిందికి వేలాడుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి గాలి వీచినా విద్యుత్ వైర్లు ఒక దానికి ఒకటి తగిలి మంటలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. వేలాడే వైర్లపై విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు విమర్శిస్తున్నారు. పల్నాడుకు ముఖ ద్వారంగా ఉన్న వినుకొండ చుట్టుపక్కల నుంచి ట్రాక్టర్లపై గడ్డి తరలించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊరి చివరికి చేరేవరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాహనాల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. స్థూపం సెంటర్‌లో ఇటీవల గణేష్ నిమజ్జనంలో విగ్రహాలకు విద్యుత్ వైర్లు తప్పించాలంటే నిర్వాహకులకు పెద్ద తలనొప్పిగా మారింది. అక్కడ విగ్రహానికి వైర్లు తగిలి పెద్దఎత్తున నిప్పురవ్వలు రావటంతో స్థానికులు ఆందోళన చెందారు. విద్యుత్ సిబ్బంది రోడ్డుకు అడ్డంగా వేలాడే విద్యుత్ వైర్లును తొలగించి, ప్రమాదాల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

చేతికందేలా ట్రాన్స్‌ఫార్మర్

పట్టణంలోని ముట్లగుంట కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండటంతో స్థానికులు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. భూమికి రెండు అడుగుల ఎత్తులో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. దీంతో మూగజీవాలు, చిన్న పిల్లలకు తగిలే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ ఏర్పాటు చేయాలని, లేదా ఎత్తైన దిమ్మెను నిర్మించి ప్రమాదాలనుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 19: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామంలోని గ్రామ సచివాలయంలో గురువారం పలు ఈవెంట్లు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి వుసర్తి శ్రీనివాసరావు, గ్రామ అభివృద్ధి, కమిటీ నాయకులు గంగుల పెద్దిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కేవీ శివప్రసాద్ పాల్గొన్నారు. రోడ్లను శుభ్రం చేయటం, పిచ్చి మొక్కలను తొలగించటం, మురుగు కాలువల్లో సిల్టుతీసి బ్లీచింగ్, సున్నం కలిపి చల్లించారు.

శ్యావల్యాపురంలో...

పోట్లూరు (శావల్యాపురం) సెప్టెంబరు 19: గ్రామాలలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్వచ్ఛత-హి-సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోట్లూరులో పారిశుధ్యం మెరుగుదలకు ప్రజలంతా సహకరించాలని కోరుతూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు జడ్పీ పాఠశాల విద్యార్థులతో కలసి గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసచివాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుగుణ, ఏపీవో రామారావు, హెచ్ఎం అన్నపూర్ణమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, వీఆర్వో అక్కయ్య, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ, సెప్టెంబరు 19: స్వభావ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత అన్న నినాదంతో స్వచ్ఛతాహి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యాసంస్థలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమంను మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయం సిబ్బంది, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి, సెప్టెంబరు 19: మండలంలోని పేరూరుపాడు ఎంపీయూపీ స్కూల్‌లో స్వచ్ఛతా హీ ఈసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేరూరుపాడు ఎంపీపీ స్కూల్‌లో గురువారం సచివాలయ సిబ్బంది మల్లికార్జునరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పరిశుభ్రత గురించి ఆంధ్రప్రదేశ్ ముందడుగు, ఆంధ్ర రాష్ట్రాన్ని శుభ్రపరచటంలో సాయం చేస్తుందన్నారు. ప్రతి వారానికి రెండు గంటలు శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సంకల్పానికి కట్టుబడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రీడా పోటీలు ప్రారంభం

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 19: మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు ప్రారంభమయ్యాయి. పోటీలను మండల విద్యాశాఖాధికారి ఎస్.నాగేశ్వరరావు రిబ్బన్ కత్తిరించి లాంఛనంగా ప్రారంభించారు. క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం, మానసికోల్లాసం కలుతుందని ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు తెలిపారు.

ఈపూరులో...

ఈపూరు, సెప్టెంబరు 19: పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఈపూరు హైస్కూల్‌లో అండర్-14, 17 విభాగాలలో బాల, బాలికలకు గురువారం ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలను, ఎంఈవో రామతులసి, హెచ్ఎం ఎన్.రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, యోగా, పోటీలలో అన్ని హైస్కూల్స్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల ఆర్గనైజేషన్ సెక్రటరీగా మద్దం వెంకటేశ్వర్లు, వైవీ చిరంజీవి, కే యేసురాజు, రూత్‌మేరి కే వెంకట్ గోపి, శ్రీనివాస్ వ్యవహరించారు.



ఈపూరులో విజేతలతో ఉపాధ్యాయులు

నూజెండ్లలో...

నూజెండ్ల, సెప్టెంబరు 19: స్థానిక జడ్పీ పాఠశాలలో గురువారం ఆటల పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభా పాటవాలు ప్రదర్శించాలని, క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని వక్తలు వివరించారు. మొదటిరోజు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి, జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు, సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, ఎంఈవో సాంబశివరావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం వీవీ శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎం వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

● రెడ్‌క్రాస్ పల్నాడు జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 19: రక్తదానంపై ఉన్న అపోహలను వీడి ప్రజలు యువత ముందుకు రావాలని రెడ్‌క్రాస్ పల్నాడు జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాలలో సహకారం అందించిన జేఎన్‌టీయూ, ఏఎంరెడ్డి, ఎస్ఎస్ఎన్, వాగ్దేవి కళాశాల యాజమాన్యాలను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉన్న రక్తనిధి కేంద్రాలలోని రక్త నిల్వలు కేవలం 30శాతం వైద్య అవసరాలకే సరిపోతున్నాయని అన్నారు. ఏఎంరెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతిశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతులు విరివిగా రక్తదానం చేస్తే గుండె జబ్బులు, పక్షవాతం, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు దూరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కేఎంఎన్‌వీ శ్రీనివాసగుప్తా, బత్తుల మురళి, జీవీఎస్ రాము, డాక్టర్ రెహమతుల్లా, డాక్టర్ సృజనా జెఎన్‌టీయు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పీ రాజు, డాక్టర్ శాంతి, ఎస్ఎస్ఎన్ ప్రిన్సిపాల్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌సాయి, వాగ్దేవి కాలేజ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా లంకా

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడిగా లంకా రంగనాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పల్నాడు జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నరసరావుపేటలో సంఘం భవనంలో అధ్యక్షుడు మానం సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. గతంలో గౌరవ అధ్యక్షుడిగా ఉన్న గుర్రం అప్పిరెడ్డి మృతి చెందటంతో ఈ ఎన్నిక నిర్వహించారు. సమావేశంలో హెల్త్ కార్డులు గురించి చర్చించారు. కార్యక్రమంలో సెక్రటరీ సీసీ ఆదెయ్య, అసోసియేట్ అధ్యక్షుడు కంచుపర్తి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, బ్రహ్మారెడ్డి ఈసీ సభ్యులు పాల్గొన్నారు.



రొంపిచర్లలో వినాయకుని లడ్డును దక్కించుకున్న భక్తులు

రొంపిచర్లలో వైభవంగా నిమజ్జనోత్సవం

రొంపిచర్ల, సెప్టెంబరు 19: మండలంలోని రొంపిచర్ల బొడ్డు రాయి సమీపంలోని గణనాథుని విగ్రహం గురువారం నిమజ్జనానికి తరలివెళ్ళింది. ఈ సందర్భంగా మేళ తాళాల మధ్య జరిగిన ఊరేగింపు కార్యక్రమంలో యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అశోక్ బందోబస్తు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రూ.1.35 లక్షలు పలికిన వినాయకుని లడ్డు

బొడ్డు రాయి సమీపంలో వినాయకుని వద్ద ఉంచిన లడ్డును చందలూరి వెంకటేశ్వర్లు రూ.1.35 లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. మరొక లడ్డును బొజ్జ కనకరాములు రూ.30వేలకు వేలంలో దక్కించుకున్నాడు.

వేద విద్యనభ్యసించిన నిరుద్యోగులకు భృతి

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టో అమలులో భాగంగా రాష్ట్రంలో వేద విద్యనభ్యసించిన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు పొందేందుకు దరఖాస్తులు స్వీకరించాల్సిందిగా దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా దేవదాయ శాఖాధికారి కోట వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేద విద్య సర్టిఫికెట్లు, ఆధార్ నకలు, ఎటువంటి ఉద్యోగం చేయడం లేదని స్వీయ ధృవపత్రంతో దరఖాస్తులను జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో ఈ నెల 26లోపు సమర్పించాలని కోరారు.

పీహెచ్‌సీల్లో మందుల కొరత

రొంపిచర్ల, సెప్టెంబరు 19: మండలంలోని రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు కొరత వెంటాడుతోంది. సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మందుల కోసం వెళితే సరైన సమాధానం కూడా చెప్పటం లేదు. వైద్యులు గత కొద్దిరోజుల నుంచి సమ్మెలో ఉన్నారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు రోగులు వాపోతున్నారు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్నా సిబ్బంది ఈ విధంగా వ్యవహరించటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాదిగల విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి

● ఉద్యోగుల సమైక్య నియోజకవర్గం ఉపాధ్యక్షుడు బుజ్జి

వినుకొండ టౌన్, సెప్టెంబరు 19: తెనాలిలో ఈ నెల 21 తేదీన జరిగే మాదిగల విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని మాదిగల ఉద్యోగుల సమైక్య నియోజకవర్గం ఉపాధ్యక్షుడు మాచర్ల బుజ్జి గురువారం పిలుపునిచ్చారు. స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో విజయోత్సవ ర్యాలీ గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు మంద కృష్ణమాదిగ రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో జోసఫ్, కందుకూరి శ్యామ్, స్వర్ణ, ముసలయ్య, పౌల్, రాజు, కోటి, పంతులు, స్టీవెన్, ఆనంద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో అన్నదానం

వినకొండ టౌన్, సెప్టెంబరు 19: వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని చెవిటి, మూగ, విద్యార్థులకు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నవితరణ అనంతరం, ప్లేట్లు, దుప్పట్లు అందచేశారు. కార్యక్రమంలో రొడ్డా వీరాంజనేయరెడ్డి, రెడ్డి బంగారయ్య, గుడివాడ వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, నాగూర్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



బధిరుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట కమిషనర్‌గా శ్రీహరిబాబు



చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, సెప్టెంబరు 19: చిలకలూరిపేట నూతన మునిసిపల్ కమిషనర్‌గా పి.శ్రీహరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన చుక్కల గోవిందరావు మాతృశాఖ అయిన రాష్ట్ర సచివాలయంలోని విభాగానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ శ్రీహరిబాబును డీఈ రమణ, ఏఈలు, మున్సిపల్ మేనేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, మున్సిపల్ సిబ్బంది కలిసి ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీహరిబాబు స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు స్వగృహం వద్దకు వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, టీడీపీ కౌన్సిలర్ గ్రూపు నాయకుడు గంగా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పల్నాడు జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీగా జేవీ సంతోష్

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 19: పల్నాడు జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీగా జేవీ సంతోష్ గురువారం బాధ్యత స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన నంద్యాల జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా సేవలందించారు. ఇటీవల పదోన్నతి పొంది పల్నాడు జిల్లాకు పరిపాలన అదనపు ఎస్పీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లాలోని పలువురు పోలీస్ అధికారులు కలిసి అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో స్కూల్ గేమ్స్ నిర్వాహకులు

ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ జూడో జట్ల ఎంపిక

చిలకలూరిపేట, సెప్టెంబరు 19: చిలకలూరిపేట ఏఎంజీ హైస్కూలులో అండర్ 14 అండర్ 17 బాలబాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా జూడో జట్ల ఎంపిక గురువారం జరిగింది. పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ పర్యవేక్షణలో ఈ ఎంపిక జరిగింది. గుంటూరు జిల్లా జట్టు తరపున ఎంపికైన క్రీడాకారులు త్వరలో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీలలో పాల్గొంటారు. వీరిని ఏఎంజీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి, ఏఎంజీ హైస్కూల్ హెచ్ఎం కే కృపాదానం, పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఖాదర్ మస్తాన్, చిలకలూరిపేట జోన్ అధ్యక్షుడు ఖాసీం బుడే, కార్యదర్శి పి.రాజు, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సహాయక కార్యదర్శి బి.శ్రీనివాస్ అభినందించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నాదెండ్ల, సెప్టెంబరు 19: ద్విచక్ర వాహన చోరీకి పాల్పడిన కేసులో అచ్చి అంకమ్మ అనే వ్యక్తిని గురువారం నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 22వ తేదీన గణపవరం గ్రామానికి చెందిన గుంటుపల్లి శ్రీనివాసరావు ద్విచక్ర వాహనాన్ని గ్రామంలోని ఎంఎల్ కంపెనీ వద్ద పెట్టి లోపలకు వెళ్ళి బయటకు వచ్చేటప్పటికీ వాహనం చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు నిందితుడు అదే వాహనం వస్తుండగా అరెస్టు చేశారు. న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి ఆటల పోటీలు

నాదెండ్ల, సెప్టెంబరు 19: మండలంలోని సాతులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం జిల్లా స్థాయిలో పలు క్రీడలు నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయుడు వీ వెంకటరావు, పీడీ అంజమ్మలు తెలిపారు. జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికకోసం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల కోసం క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేశామని వారు వివరించారు.



బాలికలకు కళ్ళజోళ్ళు అందజేసిన రోటరీ క్లబ్ నిర్వాహకులు

పోతవరం హైస్కూలులో రోటరీ నేత్ర వైద్య శిబిరం

చిలకలూరిపేట, సెప్టెంబరు 19: స్థానిక రోటరీ క్లబ్ పండరీపురం వారి ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలం పోతవరంలోని కస్తూరిబా హైస్కూల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు అనంతరం 26మంది బాలికలకు కళ్ళజోళ్లు అవసరమని మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి వారు నిర్ధారించారు. వారికి ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం స్థానిక లలిత ఆప్టికల్స్ వారి సహకారంతో చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శరత్, కార్యదర్శి కొల్లా సుబ్బారావు, క్లబ్ డైరెక్టర్లు కొల్లా సింగారావు, డి.పుల్లయ్య, పి.రాఘవయ్య టి.వసంతరావు, అలంగార్ మోహన్, సందీప్, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి ఇన్నర్‌వీల్ క్లబ్ చేయూత

చిలకలూరిపేట, సెప్టెంబరు 19: విద్యార్థుల ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదనే లక్ష్యంతో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారు పేద విద్యార్థులను ఆదుకుంటున్నదని క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని బుధవారం చెప్పారు. భవ్య అనే ఇంజనీరింగ్ విద్యార్థినికి రూ.5వేల ఆర్థికసాయాన్ని క్లబ్ పూర్వ అధ్యక్షురాలు గోరంట్ల పద్మజ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాత పద్మజ, కార్యదర్శి నార్నె జయలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలు

నాదెండ్ల, సెప్టెంబరు 19: పర్యావరణాన్ని పరిరక్షించుకోవటం ద్వారానే ఓజోన్ పొరను రక్షించుకోగలుగుతామని ప్రధానోపాధ్యాయురాలు కే.నిర్మల అన్నారు. ప్రపంచ ఓజోన్ డేను పురస్కరించుకొని విద్యార్థినీ, విద్యార్థులకు ఓజోన్ పొర ఆవశ్యకత, పర్యావరణ సమతుల్య ప్రాముఖ్యంపై నాదెండ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ చెట్లు నరికితే క్షామమని, చెట్లు పెంచితే క్షేమమన్నారు. ప్రతిఒక్కరు ఓజోన్ పొర రక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కాంగ్రెస్ అధికారి ఎస్ రాజశేఖర్, ఉపాధ్యాయులు కెల్లంపల్లి రెడ్డెయ్య, రామచంద్ర నాయక్, సుభానీ, దుర్గాదేవి, ప్రభావతి, సాంబశివరావు తదితదరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

రొంపిచర్ల, సెప్టెంబరు 19: మండలంలోని సంతమాగులూరు - మునమాక రైల్వే స్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతి చెంది ఉండటాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. చనిపోయిన వ్యక్తి కాఫీరంగు నిండు చేతుల చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని రైల్వే ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మృతుడిని గుర్తించిన వారు ఫోన్ నెంబరు 9948525386ను సంప్రదించాలన్నారు.